ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు పనిచేయాలి

-ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

సికింద్రాబాద్, మే 7 ప్రభావార్త: మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అమలవుతున్న 99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వివిధ శాఖల పనితీరు, ఇప్పటివరకు సాధించిన పురోగతిపై గురువారం తార్నాకలోని ప్రధాన కార్యాలయంలో ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి జోనల్ కమిషనర్లు, హెచ్‌వోడీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో భాగంగా శానిటేషన్, వెటర్నరీ, ఎంటమాలజీ, ఇంజనీరింగ్, యూసీడీ, యూబీడీ, స్పోర్ట్స్, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, ప్రజా సేవల మెరుగుదల, క్షేత్రస్థాయి అమలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా విభాగాల మధ్య సమన్వయంతో పనిచే

అధికారులతో సమీక్షా సమావేశం జరుపుతున్న ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

యాలని సూచించారు. అలాగే ప్రతి శాఖ తమ పని తీరును మరింత వేగవంతం చేసి, క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

హైదరాబాద్ వార్త

క్లిక్ చేయొద్దు..మోసపోవద్దు!

- ఆఫర్లు అంటూ సోషల్ మీడియాలో ప్రకటనలు
- వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా మెసేజీలు
- లింకులు ఓపెన్ చేసి వివరాలు పంపాలని వల
- బ్యాంకు సమాచారం ఎంట్రీ చేయగానే డేటా చోరీ
- అనంతరం బ్యాంకు ఖాతాల్లో డబ్బులు మాయం
- ఇటీవల రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలంటున్న సైబర్ క్రైం పోలీసులు

హైదరాబాద్, మే 7 ,ప్రభాతవార్త: "అమెజాన్‌లో బంపర్ ఆఫర్లు ..మీరు క్రెడిట్ కార్డు అఫర్ వచ్చింది..ఫ్లికార్డులో మీకు 70శాతం క్యాష్‌బాక్ పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నా ..కొనుగోలు చేయాలన్నా ఈకింది లింక్ ఓపెన్ చేయండి " ఈక్రింద లింక్‌లో మీసమాచారం పొందుపరచండి "అంటూ ఇలా ప్రస్తుతం ఆయా కంపెనీలనుంచి కాకుండా సైబర్‌నేరగాళ్లనుంచి స్పామ్ మెసేజ్‌లు వస్తున్నాయి. పొరపాటున ఎవరైనా వాటిపై క్లిక్ చేస్తే ఆసెల్‌ఫోన్‌లోని సమస్త సమాచారం సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్ళిపోయి డబ్బులు కూడాపోగొట్టుకుంటున్నారు. తాజాగా కరెంట్ బిల్లు పెండింగ్ పేరుతో సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు కేటుగాళ్లు. మీ కరెంట్ బిల్ పెండింగ్లో ఉంది.. డబ్బులు చెల్లించాలని ఫోన్లకు మెసేజ్, లింక్ పంపుతున్నారు. సాయంత్రంలోగా బిల్లు చెల్లించకపోతే మీ ఇంటికి కరెంటు కట్ అవుతోందని బెదిరిస్తున్నారు. కరెంట్ కట్ కాకుండా ఉండాలంటే మీ ఫోన్‌కు వచ్చిన లింక్ ద్వారా బిల్లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. నిజంగానే కరెంట్ కట్ అవుతుందేమోనని ఆందోళనకు గురై సైబర్ నేరగాళ్లు పంపిన లింక్ ఓపెన్ చేస్తున్నారు దీంతో ఆ లింక్ ఓపెన్ చేయగానే అకౌంట్లలో ఉన్న డబ్బంతా మాయం అవుతోంది. మహారాష్ట్ర, బీహార్ నుంచి కరెంట్ బిల్లు పెండింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇలాంటి మెసేజ్లపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. మీకు ఇలాంటి మేసేజులు వస్తే వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

టెక్నాలజీని వినియోగించుకుని..

టెక్నాలజీని వినియోగించుకుని ప్రజలను దోచుకునేందుకు సైబర్ నేరగాళ్ల రకరకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నాల్ల కిందటి వరకు లాటరీ గెలుచుకున్నారని ,ఏటిఎం కార్డు అప్‌డేట్ చేయాలని ఫోన్‌లు చేసి బ్యాంకు ఖాతా నంబర్, ఏటిఎం కార్డు నంబర్,

పిన్‌నెంబర్ వంటి సమాచారం సేకరించి నగదును కొల్ల గొట్టేవారు. ఈతరహా మోసాలపై ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ నేరగాళ్ల కొత్త వ్యూహం అమలు చేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్నవారికి స్పామ్‌లో ఒకలింక్‌ను పంపిస్తున్నారు. ఆలింక్‌పై క్లిక్ చేయగానే వాట్సాప్ రంగు మారిపోతుంది, అత్యంత చౌకగా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులు అందుబాటులోకి వస్తాయని మెసేజ్ పంపిస్తున్నారు..నిజమేననుకుని ఎవరైనా పొరపాటున ఆతరహా లింక్‌పై క్లిక్ చేస్తే చాలా..ఆఫోన్‌లోకి వైరస్ చొరబడుతుంది. దీంతో ఫోన్ నియంత్రణ మొత్తం ఎక్కడో ఉన్న సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోతుంది. సెల్‌ఫోన్‌లోని మెసేజ్‌లు, కాంటాక్టు నంబర్లు, గ్యాలరీలోని ఫోటోలు, వీడియోలు, ఫోన్‌లో భద్రపరచుకున్న డ్యాక్యుమెంట్లు ,ఇతర సమాచారం మొత్తాన్ని సైబర్‌నేరగాళ్ల ప్రత్యక్షంగా పరిశీలించేందుకు వీలుకలుగుతుంది. ఒకవేళ ఏవైనా అభ్యంతరకరమైన ఫోటోలు, ఏకాంతంగా గడిపినప్పుడు తీసుకున్న ఫోటోలు, వీడియోలు ఉంటే వాటి ఆధారంగా బ్లాక్‌మెయిలింగ్‌కు దిగుతారు. బ్యాకులు, ఏటీఎం కార్డులకు సమాచారం ఉంటే ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లో ఖాతాను లూటీ చేసేస్తారు. ఇటీవల కాలంలో పింక్ వాట్సాప్ అంటూ ఒక లింక్ వైరల్ అవుతుంది. చూసేందుకు అచ్చంగా వాట్సాప్ ఐకాన్ మాదిరిగానే ఉండటంతో కొంతమంది తెలియకుండానే లింక్‌ను క్లిక్ చేసేస్తున్నారు. వాట్సాప్ ఐకాన్‌రంగు మారకపోవడంతో అది ఫేక్ లింక్ అనుకుని తిరిగి తమ పనిలో నిమగ్నమై పోతున్నారు. కానీ ఆతర్వాత వారికి తెలియకుండానే వారి సెల్‌ఫోన్ నుంచి తమ కాంటాక్టు లిస్ట్ ఉన్నవారందరికీ వాట్సాప్‌లో అదేలింక్ షేర్ అయిపోతుంది. తన సెల్‌ఫోన్ నుంచి ఆమెసేజ్ వెళ్ళినట్లు క్షుణ్ణంగా పరిశీలిస్తే తప్ప వారికి తెలియని పరిస్థితి ఎదురవుతుంది. నగరంలోని ఈతరహా మోసాలపై ఫోలీసులకు ఫిర్యాదు అందుతున్నాయి.

అనవసర లింకులు ఓపెన్ చేయొద్దు ..

సెల్‌ఫోన్‌కు వచ్చే అవనవసర లింకులపై క్లిక్ చేయడం ప్రమాదం. సైబర్ నేరగాళ్లు కొత్తఎత్తులతో నిత్యం ప్రజలను మోసం చేయాలనే ప్రయత్నిస్తుంటారు. అందుకోసం ఖండాంతరాల్లో ఉంటూ కంప్యూటర్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుంటారు. కాబట్టి తమకు తెలియయని వ్యక్తులు లేదా నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లు, స్పామ్ మెసేజ్‌ల జోలికి వెళ్లకపోవడమే శ్రేయస్కరం. చాలామంది వాటిపై క్లిక్ చేసి ఏముందో చూద్దామనే భావనతో ఉంటున్నారు. దీనవల్ల సెల్‌ఫోన్‌లోని డేటా అవతలివారికి చేరడంతోపాటు సెల్‌ఫోన్ నియంత్రణ కూడా సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లిపోతుంది.

ఆరోగ్యకరమైన నగర నిర్మాణంలో ప్రతి ఒక్కరి పాత్ర ముఖ్యం

- పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ ఆర్.వి. కర్ణన్
- కార్మికులకు అల్పాహారం అందిస్తున్న కాలనీవాసులకు అభినందన

జయప్రకాశ్‌నగర్ కాలనీవాసులు, పారిశుధ్య కార్మికులతో కమిషనర్ కర్ణన్.

జూబ్లీహిల్స్, మే 7, ప్రభాతవార్త: ఆరోగ్యకరమైన నగర నిర్మాణంలో ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో ముఖ్యమైనదని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అన్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో గురువారం పర్యటించిన ఆయన వేసవి కాలంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. పర్యటన సందర్భంగా జయప్రకాశ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులను కమిషనర్ కలిశారు. తీవ్ర ఎండల సమయంలో పారిశుద్ధ్య కార్మికులకు అల్పాహారం ఏర్పాటు చేస్తూ వారికి అండగా నిలుస్తున్న అసోసియేషన్ సేవలను ఆయన అభినందించారు. సమాజానికి సేవ చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందిపై చూపుతున్న శ్రద్ధ ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పారిశుద్ధ్య కార్మికులు, అసోసియేషన్ సభ్యులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం జనగణన స్వీయ నమోదు (సెల్ఫ్ ఎన్యూమరేషన్) కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని, స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) కింద విలువైన సూచనలు అందించాలని కోరారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియను కూడా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటన ద్వారా సమాజ భాగస్వామ్యం, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగర నిర్మాణంలో ప్రతి ఒక్కరి బాధ్యతను కమిషనర్ ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఏ. సురేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌బీఎం) వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లుగా వ్యక్తిగత ప్రయోజనాలకే పెద్దపీట..సమస్యల పరిష్కారంలో విఫలం

-లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

చిక్కడపల్లి మే 7 ప్రభాతవార్త : హైదరాబాద్ వాటర్ బోర్డ్‌లో గత పదేళ్లుగా ఉద్యోగులు, కార్మికుల సమస్యలను గాలికొదిలేసి, కేవలం వ్యక్తిగత ప్రయోజనాల కోసం పాకులాడిన నాయకత్వానికి చరమగీతం పాడాలని కార్మిక నాయకులు పిలుపునిచ్చారు. గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ కార్మిక శాఖ కమీషనర్ కార్యాలయంలో జరిగిన కీలక సమావేశం ప్రస్తుత గుర్తింపు సంఘం నాయకుడు రాంబాబుపై కార్మికుల ఆగ్రహానికి వేదికైంది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మేమే అధికారంలో ఉన్నాం, గుర్తింపు మా దగ్గరే ఉంది అని చెప్పుకుంటూ తిరిగిన జి.రాంబాబు యాదవ్ , ఉద్యోగుల హక్కుల కోసం పోరాడటంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. మేనేజ్‌మెంట్ ముందు కార్మికుల పక్షాన నిలబడాల్సిన సమయంలో.. కాంట్రాక్టులు, బిల్లులు, సొంత ప్రయోజనాల కోసం నెగోషియేషన్లు చేస్తూ ఉద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. జీతాలు, పదోన్నతులు, బదిలీలు వంటి కీలక అంశాలపై ఎన్నడూ స్పష్టమైన పోరాటం చేయలేదని ధ్వజమెత్తారు. కార్మికుల్లో వస్తున్న వ్యతిరేకతను చూసి భయపడి, గత రెండేళ్లుగా కోర్టులను ఆశ్రయించి ఎన్నికలు జరగకుండా అడ్డుకుంటున్నారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులను అన్యాయంగా ఇబ్బందుల్లోకి నెట్టిన రాంబాబుకు ఓటు అడిగే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు.

మొగుళ్ళ రాజిరెడ్డి నాయకత్వానికే మా మద్దతు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గౌరవాధ్యక్షులు మధు యాష్కీ గౌడ్ ఆశీస్సులతో, ఐఎన్‌టియుసి అధ్యక్షులు జి.సంజీవరెడ్డి మార్గనిర్దేశంలో.. ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య వైస్ ప్రెసిడెంట్, టీజేఈయూ అధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి నాయకత్వం కార్మికుల పక్షాన బలమైన గొంతుకగా నిలిచిందని కొనియాడారు. ప్రభుత్వ స్థాయిలో చర్చలు జరిపి ఎన్నో సమస్యలను పరిష్కరిస్తున్న రాజిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. రాబోయే ఎన్నికలు ఉద్యోగుల ఆత్మగౌరవానికి నిదర్శనమని త్రిశూలం" గుర్తుకు ఓటు వేసి మొగుళ్ళ రాజిరెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్డీ చంద్రశేఖర్, టీజేఈయూ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్, కె. రాజి రెడ్డి, ఎండీ జాంగిర్, అల్లి శ్రవాన్ కుమార్, చంద్రశేఖర్, జైరాజ్, బి. నర్సింగ్ రావు, శంకర్ ప్రకాష్, ఎం. రాజా, రామచంద్ర, శ్రీనివాస్ యాదవ్, అజయ్ నాథ్, సైద్ హాసిం, ఘోసే పాషా, బి. మహేష్ తదితర కార్మిక నాయకులు, యువ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టీసీ క్రాస్ రోడ్స్ కార్మిక శాఖ కమీషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఐఎన్‌టియుసి ముఖ్య నేతలు

స్కానింగ్ కేంద్రాలపై నిరంతరం తనిఖీలు చేపట్టాలి

- -లోపాలు కనిపిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలి
- -వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశం

హైదరాబాద్, మే 7,ప్రభాతవార్త: జిల్లాలో స్కానింగ్ కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపాలు ఉన్నచో కఠినమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్య అధికారులను జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆల ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పిసిఅండ్‌పిఎన్‌డిటి చట్టం , క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టాల అమలుపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమావేశంలో ప్రజా ఆరోగ్య పరిరక్షణ, లింగ వివక్ష నివారణ అలాగే వైద్య సంస్థల నియంత్రణలో పారదర్శకతను పెంపొందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ లో ఉన్న అన్ని స్కానింగ్ కేంద్రాలను సంబంధిత యుపిహెచ్‌సి పరిధిలో మ్యాపింగ్ చేసి, వారి పర్యవేక్షణలో ఉంచాలని క్లస్టర్ వారీగా స్కానింగ్ కేంద్రాల జాబితాను సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ఎప్పటికప్పుడు రిపోర్టులను క్రమం తప్పకుండా ప్రతి నెల నివేదిక సమర్పించాలని ఏవైనా లోపాలు గమనిస్తే సంబంధిత కేంద్రాలపై చర్యలు చేపట్టాలని తెలిపారు. మే , జూన్ నెలలో రెండు అవగాహన శిబిరాలు నిర్వహించాలని అలాగే టోల్ ఫ్రీ నెంబర్ 18005 993366 ను విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఎక్కడైనా లింగ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల, డిఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి తదితరులు

నిర్ధారణ జరిగినట్లు ఫిర్యాదు అందినచో కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైన తరువాత (జూన్, జూలై నెలల్లో) కిశోర బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. దీనికి సంబంధించి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. నమోదు రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్స్ అలాగే ఆసుపత్రులకు రూ.50 వేల జరిమానా విధించాలని సూచించారు. అలాగే నోటీసులను పట్టించుకోని, జరిమానా చెల్లించని సంస్థలపై రూ .2 లక్షల జరిమాన విధించాలని సూచించారు.. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా. జె. వెంకటి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అశ్వీత రెడ్డి, డాక్టర్ జయశ్రీ, కమిటీ సభ్యులు డా. ఐలయ్య, వందన, ప్రోగ్రాం ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

పల్టీలు కొట్టిన కారు...విద్యార్థులకు గాయాలు

అత్తాపూర్ మే7,ప్రభాతవార్త : రాజేంద్రనగర్ పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై అతివేగంగా వచ్చిన కారు అదుపుతప్పి రోడ్డు ప్రమాదానికి గురైంది. లార్డ్స్ కళాశాల నుండి భర్కత్‌పురాకు టిఎస్09 ఈవి 5663 సుజుకి ఎస్ క్రాస్ కారులో విద్యార్థులు మహ్మద్ షఫీయాన్ అర్షక్, అల్తాఫ్,అబ్దులాలు బయదేరారు. ఈ క్రమంలో రాజేంద్రనగర్ పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై వెళ్తుండగా పిల్లర్ నెంబర్ 150 సమీపంలో రాగానే అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు విద్యార్థులు ప్రమాదంలో గాయపడ్డారు. అయితే అదృష్టవశాత్తూ వారు ప్రాణాపాయం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ రాజు సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అగ్నిప్రమాదంలో చిక్కుకుని సెక్యూరిటీ గార్డు సజీవ దహనం

మైలార్‌దేవ్‌పల్లి,మే 7 ప్రభాతవార్త : అగ్ని ప్రమాదంలో బిహార్‌కు చెందిన ఓ సెక్యూరిటీ గార్డు మంటల్లో చిక్కుకు ని సజీవ దహనమైన సంఘటన గురువారం తెల్లవారు జామున మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ పైడి నాయుడు కథనం ప్రకారం… బిహార్ రాష్ట్రానికి చెందిన వికాస్ కుమార్ సింగ్ (23) కుటుంబ సభ్యులతో కలిసి బృందావన్ కాలనీలో నివసిస్తున్నాడు. వికాస్ కుమార్ సింగ్ గత కొంత కాలం నుంచి ప్రైవేట్ సెక్యూరిటి గార్డుగా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి తండ్రితో పాటు కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్ర పోగా, వికాస్ కుమార్ సింగ్ మరో వ్యక్తితో కలిసి ఇంట్లోని మొదటి అంతస్తులోని గదిలో నిద్ర పోయారు. తెల్లవారు జామున ఐదు గంటల సమయంలో వికాస్‌తో పాటు నిద్ర పోయిన వ్యక్తి వాకింగ్‌కు వెళ్లాడు. కాగాఐదున్నర గంటల సమయంలో ఆకస్మాత్తుగా గదిలోకి మంటలు వ్యాపించాయి. నిద్ర మత్తులో ఉన్న వికాస్ కుమార్ సింగ్ నిద్ర నుంచి లేచి తలుపు వరకు వచ్చాడు. అప్పటికే మంటలతో పాటు పొగ గదిలోకి వ్యాపించటంతో వికాస్ కుమార్ సింగ్ ఊపి రాడక సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వికాస్ కుమార్ సింగ్ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనే అగ్ని ప్రమాదం జరిగి ఉండ వచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎలక్ట్రిక్ బైక్ సర్వీసింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

ముషీరాబాద్, మే 7, ప్రభాతవార్త: గాంధీనగర్‌లోని ఎస్‌బీఐ కాలనీలోని ఎలక్ట్రిక్ బైక్ సర్వీసింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గురువారం మధ్యాహ్న సమయంలో ప్రమాదవశాత్తూ ఎండవేడికి, బ్యాటరీలు పేలిపోవటంతో ఒక్కసారిగా మంటలు రావటంతో, అక్కడ ఉన్న బ్యాటరీ వాహనాలు, బ్యాటరీ సైకిళ్లు, బ్యాటరీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలికి చేరకుని, రెండు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపు చేశారు. స్థానికుల అప్రమత్తతతో ఎటువంటి ప్రాణ నష్టం కలుగలేదని, షాపులో ఉన్న స్టాక్ మొత్తం కాలి, బూడిద అవటంతో నష్టం దాదాపు పది లక్షల వరకు ఉండవచ్చునని భావిస్తున్నారు. సర్వీసింగ్ సెంటర్ యజమాని సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. సమాచా రం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, స్థానిక నేతలతో కలసి అగ్ని ప్రమాదానికి గురైన సర్వీసింగ్ సెంటర్‌ను సందర్శించి, బాధితుడిని పరామర్శించారు. ప్రమాదవశాత్తూ జరిగిన ఈ ఘటనలో నష్టపోయిన బాధితుడిని ప్రభుత్వం ఆదోకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు భద్రతా వారోత్సవాలు : సీఈ పివి రమేష్



: సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ సీఈ పీవీ రమేష్, ఎస్ఇ వెంకన్న

హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త : విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ శాఖ సిబ్బందిలో భద్రతపై అవగాహన పెంపొందించి ప్రమాదాలను నివారించడమే విద్యుత్ భద్రత వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని టీజీఎస్పీడీసీఎల్ మేడ్చల్ సీఈ పీవీ రమేష్ అన్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా గురువారం హబ్సిగూడ సర్కిల్ కార్యాలయంలో హబ్సిగూడ సర్కిల్ ఎస్ఇ వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈ పీవీ రమేష్ మాట్లాడుతూ గృహాలు, పరిశ్రమల్లో నాణ్యమైన ఎర్తింగ్ వ్యవస్థ తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తడి చేతులతో విద్యుత్ పరికరాలను ముట్టుకోవడం ప్రమాదకరమని, విద్యుత్ వినియోగంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. విధి నిర్వహణలో విద్యుత్ శాఖ సిబ్బంది తప్పనిసరిగా భద్రతా పరికరాలు ధరించాలని సూచించారు. విద్యుత్ వైర్లు రేకులకు లేదా చెట్లకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాలకు తడిసిన విద్యుత్ స్తంభాలను ముట్టుకోకూడదన్నారు. సెల్‌ఫోన్ చార్జింగ్‌లో ఉన్నప్పుడు తడి చేతులతో ఫోన్‌ను ఉపయోగించడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో ఎలక్ట్రానిక్ పరికరాల స్విచ్‌లు ఆఫ్ చేసి ప్లగ్గులు తీసివేస్తే పరికరాలు సురక్షితంగా ఉంటాయని తెలిపారు. ఎవరైనా విద్యుత్ ఘాతానికి గురైన సందర్భంలో ఆత్రుతతో నేరుగా ముట్టుకోకుండా కర్రలు లేదా ప్లాస్టిక్ వస్తువుల సహాయంతో వారిని విద్యుత్ ప్రవాహం నుంచి దూరం చేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు గమనిం చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ టెక్నికల్ సూర్యనారాయణ, హబ్సిగూడ డీఇ సుబ్బారావు, ఏడీఇలు, ఏఈలు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ తథ్యం

- -మహిళా బిల్లును అడ్డుకుంది కాంగ్రెస్ పార్టీ
- -10న సికింద్రాబాద్‌లో ప్రధాని మోదీ భారీ సభ
- - బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపి డీకే అరుణ

హైదరాబాద్, మే 7 ప్రభాతవార్త : తెలంగాణలో కాంగ్రెస్ అభివృద్ధి శూన్యమని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపి డీకే అరుణ అన్నారు. గురువారం బర్కత్‌పురాలోని బీజేపీ హైదరాబాద్ సిటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీకే అరుణ మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని, డబుల్ ఇంజిన్ సర్కార్ తథ్యమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మాటల మనిషి కాదని, చేతల మనిషి అని ఆమె అన్నారు. దేశ అభివృద్ధి కోసం మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని, వికసిత భారత్ లక్ష్యంతో ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ వికసిత భారత్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహిళా బిల్లును కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని డీకే అరుణ ఆరోపించారు. తెలంగాణలో గత రెండున్నర సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్ చేసిన విద్యార్థినులకు ఈవీ వాహనాలు ఇస్తామని చెప్పి అమలు చేయలేదని, మహిళా పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని చెప్పి పెంచలేదని విమర్శించారు. అలాగే రెండు లక్షల మందికి పెన్షన్లు ఇస్తామని హామీ ఇచ్చి ఒక్కరికి కూడా ఇవ్వలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, పలు అభివృద్ధి కార్యక్రమాలకు 60 శాతం నిధులు కేంద్రం ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 40 శాతం వాటాను కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులు, కొత్త రైల్వే లైన్లు, రైల్వే స్టేషన్ల ఆధునీకరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. అలాగే కేంద్రం పలు సబ్సిడీలు అందిస్తూ చిరు వ్యాపారుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. వెస్ట్ బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లో బీజేపీ అత్యధిక మెజారిటీతో విజయం సాధించిందని, పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించిందని డీకే అరుణ పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారిగా తెలంగాణకు ఈనెల 10న రానున్నారని తెలిపారు. సికింద్రాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సభకు సుమారు మూడు లక్షల మంది హాజరవుతారని అంచనా వేశారు. మోదీ పాల్గొనే సభను విజయవంతం చేయాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో లంకల దీపక్‌రెడ్డి, జి.ఆనంద్‌గౌడ్, అజెయ్‌కుమార్, కేశబోయిన శ్రీధర్, శ్యామ్‌రాజ్, కన్నె రమేష్‌యాదవ్, సూర్యప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, చిత్రంలో అజెయ్‌కుమార్, లంకల దీపక్‌రెడ్డి, జి.ఆనంద్‌గౌడ్ తదితరులు

బుర్ర కథ, హరికథ తెలుగు వారి ప్రాచీన కళా సంపదలు

చిక్కడపల్లి మే 7 (ప్రభాతవార్త) : బుర్ర కథ హరి కథ తెలుగు వారి ప్రాచీన కళా సంపద వాటి ఉనికి కోల్పోకుండా ప్రభుత్వాల కన్నా ప్రజాదరణ ముఖ్యం అని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె వి రమణాచారి అన్నారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై గాన సభ నిర్వహణలో గాన సభ పూర్వ అధ్యక్షుడు కళా సుబ్బారావు జయంతి సందర్బంగా ఏడు రోజుల పాటు ప్రముఖులైన కళా కారులచే బుర్ర కథ సప్తాహం ప్రారంభమైంది. గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రమణాచారి హాజరై సప్తహం ప్రారంభించి మాట్లాడారు. తల్లి తండ్రులను బ్రతికి ఉన్న కాలం లోనే పట్టించుకొని కొడుకులు ఉన్న పరిస్థితిలో మరణించిన తండ్రి సుబ్బారావు జయంతి నీ ప్రజోపకర కళా ప్రక్రియ బుర్ర కథ సప్తాహం పేరుతో కుమారుడు గానసభ అధ్యక్షుడు జనార్ధన మూర్తి నిర్వహించటం ఆదర్శప్రాయం అని ప్రశంసించారు నాజర్ బుర్ర కథ నాడు తెలుగు నేల పై చైతన్యం కలిగించినదని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన అధ్యక్షత వహించి కళా సుబ్బారావు గాన సభ అభివృద్ధికి చేసిన కృషి వివరించారు. వేదిక పై ప్రముఖ గాయని శ్రీమణి, శంకర్ పాల్గొన్నారు. అనంతరం ప్రభాకర స్వామి బృందం శ్రీనివాస కళ్యాణం హరి కథ ను ఆసక్తి కరంగా చెప్పారు



బుర్రకథ కళాకారులను సత్కరిస్తున్న ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి, చిత్రంలో త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి తదితరులు

బిసి ఏ కులాలకు న్యాయం చేయాలి

తెలంగాణ రాష్ట్ర బీసీ కమీషన్ ఛైర్మన్‌కు వినతి పత్రం అందచేస్తున్న తెలంగాణ బిసి ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నేతలు

ముషీరాబాద్, మే 7, ప్రభాతవార్త: బీసీ ఏ జాబితాలో ప్రస్తుతం ఉన్న అత్యంత వెనుకబడిన కులాల హక్కులను పరిరక్షించి, న్యాయం చేయాలని తెలంగాణ బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నేతలు ప్రొఫెసర్ ఎం.భాగయ్య, ఎంఎస్.నరహరి, ఎం. నర్సింహులు, అంబటి సుధాకర్ గంగపుత్రులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు వారు గురువారం తెలంగాణ రాష్ట్ర బీసీ కమీషన్ ఛైర్మన్ నిరంజన్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సమగ్ర కులగణన రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ పరిస్థితులను స్పష్టంగా వెలుగులోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఈ గణాంకాల ప్రకారం రాష్ట్ర జనాభాలో బీసీలు 56 శాతం ఉన్నప్పటికీ బీసీ వర్గాలలోని అనేక కులాల మధ్య తీవ్రమైన అసమానతలు ఉన్నాయని గుర్తు చేశారు. బీసీ ఏ జాబితాలోని కులాలు ఇప్పటికే అత్యంత వెనుకబడిన వర్గాలుగానే జీవనం సాగిస్తున్నాయని, ఈ నేపథ్యంలో బీసీ ఏ జాబితాలోని కులాలకు లభిస్తున్న పరిమిత అవకాశాలను రిజర్వేషన్లు సంక్షేమ ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, బీసీ ఏ జాబితాలో ఇతర కులాలను చేర్చి, తమకు అన్యాయం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడప శ్రీహరి, అధికార ప్రతినిధి కంటి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

17న శ్రీ లక్ష్మీనారాయణుల వసంతోత్సవం

ఆలయంలో కొలువైన శ్రీ లక్ష్మీనారాయణులు

చాంద్రాయణగుట్ట, మే 7, ప్రభాతవార్త : గౌలిపురా శ్రీరాం నగర్ కాలనీలోని బతుకమ్మ బావి వద్ద గల శ్రీ లక్ష్మీనారాయణ స్వామి, శ్రీ రాజరాజేశ్వరీ దేవస్థానంలో ఈనెల 17వ తేదీ ఆదివారం శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వసంతోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఎం.వి. శేషాద్రి అయ్యంగార్ తెలిపారు. ఉదయం 8గంటలకు ఆరాధన, బాలభోగం, 9గంటలకు కుంభాభిషేకం (108 కళశాలతో), వ సంతోత్సవం, 11 గంటలకు చక్రస్నానం, మధ్యాహ్నం 12.30 గంటలకు పుష్పార్చన, ఒంటి గంటకు అన్నప్రసాద వితరణ ఉం టుందని వివరించారు. పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్ల అనుగ్రహనికి పాత్రు కాగలరని పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

చాంద్రాయణగుట్ట, మే 7, ప్రభాతవార్త : టీజీఎస్ఆర్టీసి ఫలక్‌నుమా డిపో పరిధిలో ఈనెల 8వ తేదీ శుక్రవారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ డిపో మేనేజర్ ఎస్. రమేష్ తెలిపారు. సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో సంస్థ ఉన్నతికై అమూల్యమైన సూచనలు, సలహాలతోపాటు సమస్యలను మొబైల్ నెంబర్ 99592 26131 ద్వారా తెలియజేయాలని కోరారు. డిపో పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

లోతైన భావుకతకు ప్రతిరూపం గజల్స్ ప్రక్రియ
: పూర్వ కలెక్టర్ లక్ష్మీకాంతం

కె.వి.రమణాచారికి జాహ్నవి గజల్స్ కావ్యాన్ని అంకితమిస్తున్న లక్ష్మీకాంతం, మాధవరావు, రఘురామ్ తదితర అతిథులు

రవీంద్రభారతి, మే 7 ప్రభాతవార్త : గజల్స్ ప్రక్రియ అందమైన పదబంధాలు మాత్రమే కాక లోతైన భావుకతకు ప్రతిరూపమని యూరప్ ఇండియా సెంటర్‌ఫర్ బిజినెస్ ఇండస్ట్రీస్ ఉపాధ్యక్షుడు, కృష్ణాజిల్లా పూర్వ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, గజల్ సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కొరుప్రోలు మాధవరావు విరచిత 9వ గజల్ కావ్యం ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన బి.లక్ష్మీకాంతం, డా. కె.వి.రమణాచారి, బెల్లంకొండ ప్రసేన్, సాధన నరసింహాచార్య, రచయిత మాధవరావు, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో కలిసి గజల్ కావ్యం జాహ్నవిని ఆవిష్కరించి మాధవరావు గజల్స్‌లో భావుకతతోపాటు హృదయంలోని లాలిత్యం ప్రస్ఫుటమౌతుందని అభినందించి, తొలిప్రతిని డా. కె.వి.రమణాచారిని ఘనంగా సత్కరించి అందజేశారు. గజల్ ప్రక్రియ ఫార్సీ భాషా సంస్కృతని, ఇదొక మేకప్ చేసుకున్న అందమైన సుందరిలాంటి కళని జాహ్నవి గజల్ కావ్య స్వీకర్త, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అభివర్ణించారు. గజల్స్ ప్రేమతోనో, విరహం, వేదన, ఆవేదనతోనే వ్రాసుకునే గజల్‌ని విస్తృతపరచి సామాజికపరంగానూ వ్రాయడం ప్రశంసనీయమని రచయితను అభినందించారు. రఘురామ్ సభకు స్వాగతం పలుకగా వెంకటేశ్వరశర్మ వందన సమర్పణ కావించారు.

ప్లాస్టిక్ రహిత భవిష్యత్తు వైపు ముందడుగు వేయాలి
-మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

అత్తాపూర్ మే7,ప్రభాతవార్త : ప్లాస్టిక్ రహిత భవిష్యత్తు వైపు ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.గురువారం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన నిర్మాన్ ఈకో ప్లాస్టిక్ సొల్యూషన్స్ తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...స్థిరమైన మరియు పర్యావరణహిత పరిష్కారాల వైపు సమాజం మారాల్సిన అవసరాన్ని ఉందన్నారు. నిర్మాన్ ఈకో ప్లాస్టిక్ సొల్యూషన్స్ సంస్థ పారబోయబడిన ప్లాస్టిక్ వ్యర్థాలను అధిక బలమున్న, పర్యావరణహిత టైల్స్ మరియు ఇటుకలుగా మార్చుతోందని. ఇవి పార్కింగ్ ప్రదేశాలు, ఫుట్‌పాత్‌లు, డ్రైవ్‌వేలు, పేవర్స్ మరియు అధిక రద్దీ ఉన్న బహిరంగ ప్రదేశాల్లో వినియోగానికి అనుకూలంగా రూపొందించబడతాయని తెలిపారు.ప్రపంచంలో అత్యంత విస్తృతంగా ఉపయోగించే మౌలిక వసతుల ఉత్పత్తులలో ఒకటైన టైల్స్‌కు పర్యావరణహిత మరియు స్థిరమైన ప్రత్యామ్నాయాన్ని అందించాలనే లక్ష్యంతో ఆయన దేశానికి తిరిగి వచ్చి నిర్మాన్ ఈకో ప్లాస్టిక్ సొల్యూషన్స్‌ను స్థాపించారని వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఆర్టీఐ కమిషనర్ శ్రీమతి ముట్టంశెట్టి విజయనిర్మల,కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ పవిత్రత పరిరక్షించాలని భక్తుల డిమాండ్

ఆలయ ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సంజీవరెడ్డి నగర్, మే 7, ప్రభాతవార్త: బల్కంపేట శ్రీశ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవాలయ పవిత్రతను పరిరక్షి ంచాలని ట్రస్ట్ బోర్డు సభ్యులు, భక్తులు ఆలయ గురువారం ఈవోకు విజ్ఞప్తి చేశారు. ఆలయ సంప్రదాయాలు, గర్భగుడి పవిత్రతకు భంగం కలగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బల్కంపేట శ్రీశ్రీ ఎల్లమ్మ దేవాలయం తెలంగాణలో అత్యంత పురాతన, ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక క్షేత్రాలలో ఒకటని తెలిపారు. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం ఆలయానికి తరలివస్తుంటారని పేర్కొన్నారు. ఆలయ గర్భగుడి అత్యంత పవిత్రమైన ప్రదేశమని, అక్కడ అమలులో ఉన్న నియమాలు, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు.ఇటీవల ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తన అనుచరులతో కలిసి గర్భగుడిలోకి ప్రవేశించారని, ఇది ఆలయ నియమావళికి విరుద్ధమని భక్తులు ఆరోపించారు. ఈ ఘటన భక్తుల్లో ఆందోళన కలిగించిందని తెలిపారు. ఈ ఘటనపై ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తో పాటు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గర్భగుడి వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని కోరారు. ముఖ్యంగా గర్భగుడి వద్ద ఉన్న ఇత్తడి పైపులకు వెల్డింగ్ చేయించి ఎవరూ అనధికారికంగా లోపలికి ప్రవేశించకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ఘటనకు బాధ్యులైన అధికారులపై, నియమావళిని ఉల్లంఘించిన వారిపై షోకాజ్ నోటీసులు జారీ చేసి తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలు, పవిత్రతను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవీన్ రాజ్, రవి కిరణ్, శ్రీకాంత్ యాదవ్, అమృత, ఎస్ఎస్ రావు, రవి, ప్రతాప్ నాయక్, పద్మావతి, నరేష్, అండాలు, వినోద్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణతో మార్మోగుతున్న చిక్కడపల్లి వీధులు

వాహనసేవలో పాల్గొన్న ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్-కీర్తి దంపతులు, భక్తులు

చిక్కడపల్లి, మే 7 ప్రభాతవార్త: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సమస్త వాహనాలలో సర్వశ్రేష్ఠమైంది గరుడ వాహనం. గరుడ వాహనంపై ఊరేగే స్వామి వారిని దర్శించుకుంటే.. ఈతి బాధల నుంచి ఉపశమనం లభిస్తుందని విశ్వాసం. అత్యంత కీలకమైనదిగా భావించే గరుడ వాహన సేవలో శ్రీనివాసుడు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల కన్నులకు ఆనందం కలిగిస్తూ మాడవీధుల్లో దేదీప్యమాన కాంతులతో గరుడ వాహనంపై శ్రీవారు కొంగు బంగారంగా భక్తులను అనుగ్రహించారు.ఈ సేవను వీక్షించడానికి వచ్చిన భక్తులతో మాడ వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ఎటువైపు చూసిన గోవిందా గోవిందా అనే నామస్మరణం వినిపిస్తోంది. గరుడ సేవకు అత్యధికంగా భక్తులు తరలివచ్చిన నేపథ్యంలో ఆలయం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాంచరాత్రాగమ శాస్త్రోనుసారంగా క్షేత్రసాంప్రదాయంగా అలయం వ్యవస్థాపక వంశీయులు అలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్-కీర్తి దంపతులు, సహాయ కమీషనర్ వి.అంబుజ ఆధ్వర్యంలో జపహోమ, పూజ, అర్చనాది సేవలతో ధార్మిక ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. బ్రహ్మోత్సవాల్లో గరుడ వాహన సేవకు విశిష్ట స్థానం.. స్వామివారిని దర్శిస్తే బాధల నుంచి విముక్తి లభిస్తుందని భక్తులకు నమ్మకం. ఈ వాహన సేవల్లో పాల్గొనే భక్తులు శ్రీవారి కృపాకటాక్షాలకు పాత్రులవుతారని, సకల పాపాలు తొలగిపోతాయని. జ్ఞానం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఉత్సవాల్లో భాగంగా మహానివేదన, మంత్రపుష్పం పూర్తయిన తర్వాత వేదపారాయణము, ద్రావిడ ప్రబంధము భేరిపూజ, మహానివేదన అనంతరం వాహన సేవ జరిగింది.

లేబర్ కోడ్‌తో కార్మికులకు అన్యాయం జరగనివ్వం : కెవి.రాధాకృష్ణన్

సమావేశంలో పాల్గొన్న బిఎంఎస్ అఖిల్ భారతీయ తేకా మజ్దూర్ మహాసంఘ్ అఖిల భారతీయ ప్రబారి కెవి.రాధాకృష్ణన్ తదితరులు

చిక్కడపల్లి మే 7, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన లేబర్ కోడ్‌లోని అంశాలు ప్రతి కాంట్రాక్టు కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ అఖిల్ భారతీయ తేకా మజ్దూర్ మహాసంఘ్ అఖిల భారతీయ ప్రబారి కెవి.రాధాకృష్ణన్ అన్నారు. గురువారం భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ అఖిల్ భారతీయ తేకా మజ్దూర్ మహాసంఘ్ కేంద్ర కార్యవర్గ సమావేశాలు యాదవ స్మృతి భవన్‌లో జరిగాయి. ఎనిమిది రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు, పదాధికారులు ఈ సమావేశంలో పాల్గొని కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. కెవి.రాధాకృష్ణన్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో కాంట్రాక్ట్ కార్మికులు వెన్నెముక వంటి వారు. కానీ నేటికీ వారికి సరైన గుర్తింపు, సామాజిక భద్రత లభించడం లేదు. క్షేత్రస్థాయిలో ప్రతి కార్మికుడిని సంఘటితం చేయడమే మన లక్ష్యం కావాలన్నారు. బి.ఎం.ఎస్ కర్ణాటక ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ చట్టబద్ధమైన హక్కుల సాధనలో న్యాయపరమైన పోరాటం అవసరం. కనీస వేతనం అనేది కార్మికుడి హక్కు, అది యాజమాన్యాలు ఇచ్చే భిక్ష కాదు. బోనస్ ఇతర సౌకర్యాల విషయంలో ఎక్కడా రాజీ పడకూడదు. ప్రతి రాష్ట్రంలో ఫెడరేషన్లు బలోపేతమైనప్పుడే కాంట్రాక్ట్ వ్యవస్థలో దోపిడీని అరికట్టగలమన్నారు. బి.ఎం.ఎస్ కర్ణాటక మాజీ అధ్యక్షులు శంకర్ సులేమాన్, మహాసంఘ్ జాతీయ అధ్యక్షుడు కంది శ్రీనివాస్, కర్ణాటక బిఎంఎస్ మాజీ అధ్యక్షులు శంకర్ సులేమాన్స్, ఇంద్రేష్, పళని, పద్మావతి, లక్ష్మి, కర్ణాటక కాంట్రాక్ట్ కార్మిక సంఘం కార్యకర్తలను మహాసంఘ్ అధ్యక్షులు కంది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సచిన్ మెంగాళే అభినందించారు.

ఘనంగా దత్తాత్రేయ స్వామి జీర్ణోద్ధరణ ప్రతిష్ట మహోత్సవాలు

దత్తాత్రేయ స్వామి వారి జీర్ణోద్ధరణ మహోత్సవంలో పాల్గొన్న సద్గ విజయానంద తీర్థ స్వామి.

యూసుఫ్‌గూడ మే 7 ప్రభాతవార్త : ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని హైమావతినగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం శ్రీ దత్తాత్రేయ స్వామివారి జీర్ణోద్ధర ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే గణపతి పూజ, పున్యాహవచనం, యాగశాల ప్రవేశం, మంటపారాధన, కళశస్థాపన, అఖండ స్థాపన, నీరాజన మంత్ర పుష్పములు తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా శ్రీశ్రీశ్రీ దత్త విజయానంద తీర్థ స్వామిజి పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే వేడుకలకు ఆలయ సంపూర్ణ నిర్మాణ దాతలు డాక్టర్ ఎల్ భరత్‌కుమార్‌రెడ్డి,డాక్టర్ ఎల్ సుస్మితలు నిర్వహిస్తున్నారు.కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయశాఖ కార్యనిర్వాహణాధికారి గుమ్మడిదల సుధాకర్ పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు

బండి రమేష్‌కు అభినందనలు తెలుపుతున్న గాయత్రినగర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వేముల సత్యం

యూసుఫ్‌గూడ మే 7 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీలో అహర్నిశలు నాయకులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని గాయిత్రినగర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వేముల సత్యం అన్నారు. నియోజకవర్గం టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్‌కు ఖమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించబడ్డ సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు.

రజక సంఘం కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా డాక్టర్ దాసరి రాజు అజయ్ కుమార్

కెపిహెచ్‌బి కాలనీ, మే 7, ప్రభాతవార్త : కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు డాక్టర్ దాసరి రాజు అజయ్ కుమార్ రాష్ట్ర రజక సంఘం కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా గురువారం నియమాక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి చైర్మన్ పదవి కట్ట పెట్టినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. రజక సంఘం కుటుంబ సభ్యులకు ఆర్థికంగా రాణించేల రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందేల వారి ఎదుగుదలకు తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ మరమ్మతుల సమయంలో సిబ్బంది భద్రత పాటించాలి

పరికరాలను అందచేస్తున్న బేగంబజార్ ఎ.ఇ కళ్యాణి

బేగంబజార్,మే 7 ప్రభాతవార్త: విద్యుత్ విధి నిర్వహణలో సిబ్బంది ప్రమాదాలు జరుగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బేగంబజార్ అసిస్టెంట్ ఇంజనీర్‌కళ్యాణి అన్నారు.ట్రాన్స్‌కో బేగంబజార్ డివిజనల్ పరిధిలో బేగంబజార్ విద్యుత్ సెక్షన్‌లో విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వహించారు.విధి నిర్వహణలో సిబ్బంది చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు.విద్యుత్ పనులు చేపట్టే సమయంలో సిబ్బంది విద్యుత్ పరికరాలను తప్పకుండా ఉపయోగించాలన్నారు.విద్యుత్ స్తంభాలపై పని చేసే సమయంలో స్టేఫీ బెల్ట్,చేతులకు రబ్బర్ తొడుగులు ధరించాలన్నారు.విద్యుత్ పనులు చేపట్ట సమయంలో లైన్ మీద ఉండే సిబ్బంది ముందుగా లైన్ క్లీయర్ నిర్ధారణ చేసుకోవాలన్నారు.తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు.విద్యుత్,ఉద్యోగులకు సిబ్బందికి భద్రత కింద హెల్మెట్,ఎర్త్‌రాడ్‌తోపాటు సేఫ్టీ వస్తువులను అందచేశారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌ను నిర్ణయించుకుని ముందుకు సాగండి
: మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్, మే 7 ప్రభాతవార్త : ఉత్తమ ఫలితాలతో పాటు భవిషత్ లక్ష్యాలను ఉత్తమంగా రూపొందించుకోవాలని ముందుకు సాగాలని కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ సూచించారు. గిరినగర్‌లోని నవజ్యోతి హైస్కూల్ పదవతరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నవజ్యోతి హైస్కూల్ కార్మికవాడలో నెలకొల్పినా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కోసం యాజమాన్యం చేస్తున్నకృషిని అభినందించారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రుల ఆర్థిక, సామాజిక స్థితిగతులకు అనుగుణంగా ప్రోత్సహించి మంచిఫలితాలను సాధించడం జరిగిందన్నారు. నవజ్యోతి హైస్కూల్ కరస్పాండెంట్ ఇందిరా రవిందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఉత్తమఫలితాలతోపాటు క్రీడలతోపాటు శారీరక, మానసిక వికాసానికి ప్రత్యేక శిక్షణ ఇస్తూ అన్ని రంగాలలో తీర్చిదిద్దుతన్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇంచార్జి రామిరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణారెడ్డిలతోపాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేశవగిరిపై శ్రీచక్ర ప్రతిష్ఠాపన మహాయజ్ఞం

కోటి శ్రీచక్ర ప్రతిష్ఠాపన పూజలను నిర్వహిస్తున్న ఎంఎస్‌జె శ్రీనివాసులు, డీఎస్పీ రుద్ర భాస్కర్ దంపతులు

చాంద్రాయణగుట్ట, మే 7, ప్రభాతవార్త : పాతబస్తీ చాంద్రాయణగుట్ట కేశవగిరిపై గల చారిత్రక శ్రీ భ్రమరాంబదేవి సమేత శ్రీ చెన్నమల్లిఖార్జునస్వామి దేవస్థానంలో గురువారం శ్రీచక్ర యంత్ర ప్రతిష్ఠాపన మహా యజ్ఞం, శ్రీ దత్త హోమం, అనఘా కళ్యాణాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కాంచీపురం శ్రీ చక్రదత్త క్షేత్రం ఆధ్వర్యంలో వేద పండితుల వేద మంత్రాల మధ్య కోటి శ్రీ చక్ర ప్రతిష్ఠాపన మహా యజ్ఞం, శ్రీ లలితా సుందరి అమ్మవారి విగ్రహం దిగువన ప్రతిష్ఠించే శ్రీ పీఠం, శ్రీపాద వల్లభుల (దత్తాత్రేయ) విగ్రహం దిగువన ప్రతిష్ఠించే శ్రీ యంత్రం పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీ చక్ర ప్రతిష్ఠాపన మహా యజ్ఞం, శ్రీ దత్త హోమాన్ని జరిపించారు. ఈ పూజా కార్యక్రమాలలో చేవెళ్ల ఎంఎస్‌జె శ్రీనివాసులు, ఇంటెలిజెన్స్ డిఎస్‌పి రుద్ర భాస్కర్ దంపతులతోపాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొని యజ్ఞ భగవానుడికి యజ్ఞ ద్రవ్యాలను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు కోటి హరీష్ కుమార్ పర్యవేక్షణలో అర్చకస్వాములు అనఘా కళ్యాణాన్ని జరిపించారు. ఈ కమనీయ ఘట్టాన్ని భక్తులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. మాతృమూర్తులచే సహస్రనామాలతో కుంకుమార్చన సేవ జరిగింది. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను, అన్నప్రసాదాన్ని అందజేశారు. మంగళ వాయిద్యాలు, వేద పండితుల వేదమంత్రాలతో కేశవగిరి మారుమ్రోగింది. కొండపై భక్తులతో ఆధ్యాత్మిక వాతావరణం తొనికిసలాడింది.

నిమ్స్‌లో సమగ్ర ఒబెసిటీ క్లినిక్ ప్రారంభం



ఒబెసిటీ క్లీనిక్ ప్రారంభోత్సవంలో డాక్టర్ నగరి బీరప్ప ఇతర వైద్యులు

జూబ్లీహిల్స్, మే 7, ప్రభాతవార్త: నిమ్స్‌లో ఎండోక్రినాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక సమగ్ర ఒబెసిటీ క్లినిక్‌ను గురువారం నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప ప్రారంభించారు. ఊబకాయంతోపాటు దానికి సంబంధించిన మెటాబాలిక్ వ్యాధులతో బాధపడుతున్న వారికి శాస్త్రీయ, ఆధారపూర్వక, బహుళ విభాగాల సమన్వయంతో వైద్య సేవలు అందించడం ఈ క్లినిక్ ముఖ్య ఉద్దేశ్యంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప మాట్లాడుతూ, ఈ క్లినిక్ ప్రారంభం ద్వారా ఊబకాయం పై ప్రజల్లో అవగాహన పెంపు, ప్రారంభ దశలోనే చికిత్స అందించడం, సమగ్ర వైద్య సేవలను మరింత బలోపేతం చేయడం సాధ్యమవుతుందన్నారు. పాత భవనంలో 36వ నంబరు గదిలో ఉదయం 11 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సోమవారం నుండి శనివారం వరకు ఉంటుందన్నారు. ఎండోక్రినాలజీ విభాగాధిపతి డాక్టర్ బియాట్రీ అన్నె మాట్లాడుతూ, ఊబకాయం చికిత్స శాస్త్రీయంగా, మానవీయ దృక్పథంతో, వివక్ష లేకుండా ఉండాలన్నారు. బరువు ఆధారంగా జరిగే వివక్ష, అపోహలు చాలా మంది చికిత్సకు అడ్డంకిగా మారుతున్నాయన్నారు. ఇది మానసిక ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. ఊబకాయం ప్రపంచవ్యాప్తంగా అత్యంత తీవ్రమైన ప్రజారోగ్య సమస్యలలో ఒకటిగా మారిందన్నారు. ఊబకాయం కారణంగా టైప్2 మధుమేహం, రక్తపోటు, ఫ్యాటీ లివర్ వ్యాధి, స్లీప్ అప్నియా, వంధ్యత్వం, ఆస్టియోఆర్థరైటిస్, గుండె సంబంధిత వ్యాధులు మరియు కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశాలు అధికమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.సుమన, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డా.శాంతివీర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డా. లక్ష్మీ భాస్కర్, డా.విజయ్ కుమార్ డా.పద్మజ, డా.శ్రవణ్, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

9నుండి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

కరదీపిక ఆవిష్కరణలో శేషాచారి,బద్రీనాథ్,శ్రీనివాస చారి తదితరులు..

కార్వాన్,మే 7(ప్రభాతవార్త) జియాగూడలోని శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో 9వ తేదీ నుండి 17వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతోందని ఆలయకమిటీ ట్రస్టీ శృంగారం శేషాచారి తెలిపారు.ఈ సందర్భముగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్సవాల కరదీపిక ఆవిష్కరించి,ఉత్సవ కార్యక్రమాలను వివరిస్తూ..10న ఆదివారం ఉదయం ధ్వజారోహణం, సంతానం కోరకు గరుడ ప్రసాదం ఇవ్వబడునన్నారు.12న మంగళవారం సాయంత్రం 7 గం.ల నుండి శ్రీ భూదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి వారి కళ్యాణోత్సవం నిర్వహించడం జరుగుతోందని,13న బుధవారం సాయంత్రం 6.30 నుండి శ్రీ రంగనాథ స్వామివారి రథోత్సవం,8 గం.ల నుండి అన్నప్రసాదము అందజేత,15న శుక్రవారం ఉదయం శ్రీ పుష్పయాగం,17న ఉదయం సహస్ర కలశాభిషేక మహోత్సవం,సాయంత్రం ప్రసాదం గోష్ఠి ఇత్యాది కార్యక్రమాలు జరుగునన్నారు.శృంగారం శ్రీనివాస చారి మాట్లాడుతూ..గరుడ ప్రసాదం ప్రత్యేకత వివరిస్తూ..గరుడ ప్రసాదం స్వీకరించిన వారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల బలమైన విశ్వాసం అని,బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ సమయంలో ఈ ప్రసాదాన్ని పంపిణీ చేస్తారని,భక్తులందరూ తప్పక హాజరై స్వామి కృపకు పాత్రులు కావలసిందిగా కోరారు. సంతానం లేని మహిళల కోసం ఈ ప్రత్యేక పూజలు చేస్తారని, గరుడ ప్రసాదం స్వీకరించిన వారు కుటుంబంతో సహా కళ్యాణ మహోత్సవంలో పాల్గొనవచ్చునన్నారు.వివరాలకు జియాగూడ శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రంగ,బద్రీనాథ్,సందీప్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆభరణాల అసలైన రక్షణ

జువెలరీ షాపు యజమానులకు సూచనలు చేస్తున్నా కెపిహెచ్బి కాలనీ పోలీసులు

కెపిహెచ్‌బి కాలనీ, మే 7, ప్రభాతవార్త కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని జువెలరీ షాప్ యజమానులతో లలిత జ్యువెలరీలో కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెపిహెచ్‌బి పరిధిలోని వివిధ జువెలరీ షాప్ యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జువెలరీ షాప్‌లలో దోపిడీలు, దొంగతనాలు, సైబర్ మోసాలు జరగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు.ప్రధానంగా షాప్‌లలో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలనీ ప్యానిక్ బటన్, అలారం సిస్టం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఉద్యోగుల పూర్తి వివరాలు, పోలీస్ వెరిఫికేషన్ నిర్వహించాలనిఅనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఫేక్ యూపీఐ స్క్రీన్‌షాట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. నగదు, బంగారం రవాణాలో భద్రతా జాగ్రత్తలు పాటించాలని, అత్యవసర సమయాల్లో వెంటనే డయల్ 100 / 112కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ముఖ్య లక్ష్యమని, ప్రతి జువెలరీ షాప్ యజమాని భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 20 మంది వరకు జువెలరీ షాపు యజమానులు 30 మంది సిబ్బంది కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

లూకా వెల్నెస్ స్పాపై కేసు నమోదు

జూబ్లీహిల్స్, మే 7, ప్రభాతవార్త: బంజారాహిల్స్‌లోని లూకా వెల్నెస్ స్పాపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ ఎస్సై విజయ్ కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 10 లోని లూకా వెల్నెస్ స్పాపై దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా స్పా కొనసాగుతున్నట్లు గుర్తించారు. హైకోర్టు మార్గదర్శకాల ఉల్లంఘనతోపాటు అర్హత కలిగిన సిబ్బంది లేకపోవడం, రిజిస్టర్ల నిర్వహణలోపం, భద్రతాచర్యలు లేకపోవడం, నియంత్రణపరమైన లోపాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో స్పా యజమాని సాయి తరుణ్‌పై కేసు నమోదు చేయగా అతను పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మేనేజర్ శివ కోటేశ్వర్‌రావుపై కేసు నమోదు చేశామన్నారు.

రూ. 1.50 లక్షల అనధికార లావాదేవీలు

జూబ్లీహిల్స్, మే 7, ప్రభాతవార్త: అమెజాన్ పే ఖాతాకు అనుసంధానమై ఉన్న క్రెడిట్ కార్డుల నుంచి తనకు తెలియకుండానే రూ. 1.50 లక్షలు ఉపయోగించినట్లు ఒకరు ఫిల్మ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఓయూ కాలనీలో నివసించే అశోక్‌కుమార్ తమరానకు చెందిన అమెజాన్ పే ఖాతాకు ఎస్బీఐ, ఐసిఐసిఐ క్రెడిట్ కార్డులు అనుసంధానించి ఉన్నాయి. కాగా ఆయా కార్డుల నుంచి ఈ నెల 4న రూ. 1.50లక్షల అనధికార లావాదేవీలు జరిగినట్లు ఈ నెల 5న గుర్తించాడు. ఆయా లావాదేవీలతో ఆపిల్ యాప్ స్టోర్ కోడ్‌లను కొనుగోలు చేసినట్లు గుర్తించారు. దీంతో కార్డులను బ్లాక్ చేయడమే కాకుండా అమెజాన్‌కు సమాచారం అందించారు. సైబర్ మోసంగా అనుమానించి ఆయన ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ పత్రాలు సృష్టించిన 11 మందిపై కేసు నమోదు

జూబ్లీహిల్స్, మే 7, ప్రభాతవార్త: నకిలీ పత్రాలు సృష్టించి స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నించిన పదకొండు మందిపై బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. షేక్‌పేట తహసిల్దార్ పరిధిలోని సర్వే నంబరు 219, 220లోని దాదాపు 1300ల చదరపు గజాల భూమి బంజారాహిల్స్‌కు చెందిన విమల్‌కుమార్ సింగ్ పేరుతో 1983లో రిజిస్టర్ సేల్ డీడ్‌గా ఉంది. కాగా ఈ స్థలంపై నకిలీ, కల్పిత పత్రాలు సృష్టించి, ఆస్తిపై కొందరు తప్పుడు యజమాన్యాన్ని క్లెయిమ్ చేశారు. ఆయా పత్రాలను ఉపయోగించి జీహెచ్ఎంసీ నుండి నిర్మాణ అనుమతులు పొందడాన్ని గుర్తించిన విమల్‌కుమార్‌సింగ్ కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆయా అనుమతులను రద్దు చేసింది. అయినప్పటికి నిందితులు స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించడమే కాకుండా విమల్‌కుమార్‌సింగ్‌ను బెదిరించారు. ఆయన ఫిర్యాదు మేరకు అహ్మద్‌బీ, హబీబున్నీసా, హమీదున్నీసా, ఖమరున్నీసా, మెహరున్నీసా, మహమ్మద్ షబ్బీర్, తాజున్నీసా, మహమ్మద్ షకీర్, ఖాజా మొయినుద్దీన్, తాహెర్ అలీ, మహమ్మద్ మతీన్‌లపై 329(3), 318(2), 336(3), 340(2), 351(2) బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులో బంగారు గొలుసు మాయం

జూబ్లీహిల్స్, మే 7, ప్రభాతవార్త: ఒక మహిళా ప్రయాణికురాలితో అదృష్టం, దురదృష్టం దోబుచులాడాయి. మెడపై తెగిన గొలుసును గుర్తించిన మహిళ గొలుసును బ్యాగులో పెట్టుకొని బస్సు దిగిన తరువాత చూస్తే కనిపించకపోవడంతో బంజారాహిల్స్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌కు చెందిన ఆపూర్ లక్ష్మీదేవి షాపింగ్ కోసం అమీర్‌పేటకు వెళ్లింది. ఆ తరువాత ఆర్ఎస్ బ్రదర్స్ బస్టాప్ నుంచి మెహదీపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కింది. ప్రయాణంలో పంజాగుట్ట దాటిన తరువాత మెడలోని మంగళసూత్రం తెగిపోయినట్లు గుర్తించింది. దీంతో ఆమె తన హ్యాండ్‌బ్యాగ్‌లో ఆయా బంగారు పుస్తెల తాడును భద్రంగా పెట్టుకున్నారు. బంజారాహిల్స్‌లోని సాక్షి కార్యాలయం సమీపంలో బస్సు దిగి హ్యాండ్ బ్యాగ్‌లో చూడగా అందులో పెట్టిన రెండు లాకెట్లతో కూడిన దాదాపు 4.5 తులాలతో కూడిన రూ. 2లక్షల విలువైన ఆయా గొలుసు కనిపించలేదు. చుట్టుపక్కల వెదికినా కనిపించకపోవడంతో ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రెస్ క్లబ్‌లో ఉత్సాహంగా వేసవి శిక్షణ
చెస్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

విద్యార్థులకు మెళకువలు నేర్పుతున్న చెస్ సంఘం ప్రెసిడెంట్ కె.ఎస్ ప్రసాద్ తదితరులు

హైదరాబాద్, మే 7,ప్రభాతవార్త: ప్రెస్ క్లబ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం మొదలైంది. సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో ఈసీ సభ్యుడు ఎంవీ సత్యనారాయణ గురువారం ఉదయం శిబిరాన్ని ప్రారంభించారు. చెస్, యోగా శిబిరాల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ (శాట్), తెలంగాణ చెస్ సంఘం సహకారంతో చిన్నారులు యోగా, చెస్‌లో మెళకువలు నేర్చుకుంటున్నారు. చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ వ్యక్తిగతంగా చిన్నారులకు చదరంగంలో శిక్షణ ఇస్తున్నారు. త్వరలోనే పెయింటింగ్‌లో కూడా శిబిరం మొదలవనుంది.

మోదీ సభను విజయవంతం చేయాలి : చరణ్ సింగ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చరణ్ సింగ్

సంజీవరెడ్డి నగర్, మే 7, ప్రభాతవార్త: మోదీ సభను విజయవంతం చేయాలని పి. చరణ్ సింగ్ పిలుపునిచ్చారు. బుధవారం సంజీవరెడ్డి నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పి. చరణ్ సింగ్ మాట్లాడుతూ ఈ నెల 10న తెలంగాణ రాష్ట్రానికి రానున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకు ఘన స్వాగతం పలకాలని ప్రజలను కోరారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న దేశం కోసం మోదీ – మోదీ కోసం మనం భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల కోసం ప్రధాని తెలంగాణకు వస్తున్న సందర్భంగా ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఎన్. నవీన్ గౌడ్, రావుల లక్ష్మీనారాయణ, రజిత రెడ్డి, చందు ముదిరాజ్ పాల్గొన్నారు.

మోడీ సభను విజయవంతం చేద్దాం

చుట్టల బస్తీలో మహిళలతో చర్చిస్తున్న మాజీ కార్పోరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్.

బేగంపేట మే 7,ప్రభాతవార్త

సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఈ నెల 10వ తేదీన జరగనున్న ప్రధాని మోదీ సభను విజయ వంతం చేయాలంటూ,అందుకు రాంగోపాల్‌పేట డివిజన్ నుంచి మహిళలు,యువకులు,బీజేపీ కార్యకర్తలు,నాయకులు,అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరుతూ రాంగోపాల్‌పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్ స్థానిక మహిళలకు విజ్ఞప్తి చేసారు.గురువారం డివిజన్ పరిధిలోని వివిధ బస్తీల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేసారు. దేశ ప్రధానిగా మోదీ అధికారంలోకి వచ్చాక ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి చేస్తున్నారని,దేశ ప్రధాని పరేడ్ మైదానంలో జరిగే కార్యక్రమానికి వస్తున్నారని,ఈ సభను ప్రతి ఒక్కరం జయప్రదం చేయాలని సుచిత్ర కోరారు.

హమాలీలతో కల్సి సహ పంక్తి భోజనం చేసిన చీరె శ్రీకాంత్

ప్రధాని మోదీ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని,కోరుతూ బీజేపీ సీనియర్ నాయకులు చీరె సత్యనారాయణ (శ్రీకాంత్) కోరారు. గురువారం మహంకాళీ క్లాత్ మార్కెట్ హమాలీ సంఘంకు వెళ్లి వారితో కల్సి శ్రీకాంత్ సహపంక్తి భోజనం చేసారు.వారు వడ్డించిన భోజనాన్ని వారితో కల్సి నేలపై కూర్చుని రుచి చూసారు.ప్రధాని మోదీ పాల్గొననున్న సభను విజయవంతం చేయాలని హమాలీలను కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌తో పాటు మదన్,హమాలీలు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు జరగనీయం

: రాష్ట్ర క్రైస్తవ మైనారిటీ ఆర్థిక సంస్థ ఛైర్మన్ దీపక్‌జాన్

ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర క్రైస్తవ మైనారిటీ ఆర్థిక సంస్థ ఛైర్మన్ దీపక్‌జాన్

సికింద్రాబాద్, మే 7 ప్రభావార్త: నియోజకవర్గాల వ్యాప్తంగా సాగుతున్న ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర క్రైస్తవ మైనారిటీ ఆర్థిక సంస్థ ఛైర్మన్ దీపక్ జాన్ గురువారం పర్యటించారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మెట్టుగూడతో పాటు, సనత్‌నగర్ నియోజకవర్గంలోని బన్సీలాల్‌పేట్ ప్రాంతాల్లో ఉన్న పలు పోలింగ్ స్టేషన్లను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఓటర్ల నమోదు, మ్యాపింగ్ జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులతో మాట్లాడి ప్రక్రియలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్న ఆయన, ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఈ సందర్భంగా దీపక్ జాన్ పేర్కొన్నారు.

దేవనార్ అంధుల పాఠశాలలో ప్రారంభమైన జాతీయ చందరంగం పోటీలు

-పాల్గొన్న 19రాష్ట్రాల నుంచి 370మంది క్రీడాకారులు

జాతీయ ఓపెన్ ఛెస్ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

బేగంపేట మే 7,ప్రభాతవార్త

బేగంపేట దేవనార్ అంధుల పాఠశాలలో 2026 జాతీయ అంధుల చదరంగం పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి.ఈ పోటీలు 6నుంచి మే 10వరకు 9రౌండ్లలో నిర్వహిస్తున్నారు.ఈ పోటీలలో ప్రతిభ చూపిన వారికి ప్రత్యేక నగదుతో పాటు ప్రత్యేక ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు.ఈ పోటీలకు అంతరిక్ష రంగ పరిశోధనా శాస్త్రవేత్త ,డీఆర్‌డీఓ ఛైర్మన్ డా.సతీష్ రెడ్డి,విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా,దేవనార్ వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.ఏ.సాయిబాబాగౌడ్,సహ వ్యవస్థాపకులు జ్యోతిగౌడ్ లు పాల్గొని పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా డా.సాయిబాబా గౌడ్ మాట్లాడుతూ దేవనార్ అంధుల పాఠశాల విద్యార్థులు అనేక విజయాలను పోటీలలో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు, అతిధులకు వివరించారు.ఈ పోటీలలో పాల్గొనడానికి వచ్చిన క్రీడాకారులు,వారికి సహాయకులుగా వచ్చిన వారికి దేవనార్ ప్రాంగణంలో ఉచిత వసతి,భోజనం వంటి సౌకర్యాలు అందిస్తామన్నారు. డా.సతీష్ రెడ్డి మాట్లాడుతూ దేవనార్ లో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్‌లో వివిధ రకాల అంశాలను తాను పరిశీలించానని,ఎంతో అద్భుతంగా ఉన్నాయన్నారు.చదరంగం పోటీలు దేవనార్ లో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.ఈ పోటీలలో 19రాష్ట్రాల నుంచి 370మంది అంధ క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు.ఈ పోటీలో కేరళ నుంచి వచ్చిన 81ఏళ్ల వయస్సు ఉన్న క్రీడాకారుడు తో పాటు 8సంవత్సరాల బాలుడు కూడా పాల్గొనడం ప్రత్యేకం అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మిగిలిన వారు కూడా అంధ క్రీడాకారులు పోటీలలో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

కూకట్‌పల్లి జోన్‌లో అక్రమ నిర్మాణాల జోరు..

-ఎసిపిల లీలలు.. జోనల్ కమిషనర్ ఓసారి చూడరూ..

కెపిహెచ్‌బి రోడ్ నెంబర్ 1లో ఓ అక్రమ కట్టడం

సెల్లార్ కలిగిన ఫ్లాట్ నెంబర్ 175

మూసాపేట్, మే 7, ప్రభాతవార్త

సిఎంసి కూకట్‌పల్లి జోన్ కార్యాలయం పరిధిలోని కూకట్‌పల్లి, మూసాపేట్, మాదాపూర్, ఆల్విన్‌కాలనీ సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, టీపీఎస్‌ల అండదండలతో అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా వెలుస్తున్నాయి. కాగా కెపిహెచ్‌బి రోడ్ నెం 1లోని ప్లాట్ 194 గల సెల్లార్ నిర్మాణంపై పలు ఫిర్యాదులు ఉన్నప్పటికీ ఇప్పటివరకు సిజ్ చేయకపోవడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఇప్పటివరకు కొత్తగా ఏర్పడిన సిఎంసి కమిషనర్ అక్రమ కట్టడాలపై సీరియస్‌గా ఉండడంతో తగిన ఆదేశాలు ఇవ్వడంతో ఇప్పటివరకు 50 పైగా కట్టడాలు సిజ్ చేసినప్పటికి రోడ్‌పైకి వచ్చి సెల్లారు నిర్మించి కడుతున్న అక్రమ కట్టడంపై పలు పిర్యాదులు చేసినప్పటికీ సిజ్ చేయకపోవడంతో కొందరి అధికారులపై అనుమానాలు రెకెత్తుతున్నాయి.ప్రభుత్వ నిబంధనలు (జి.ఓ.ఎంఎస్ .నెం.168) స్పష్టంగా ఉన్నప్పటికీ, కళ్ళముందే అక్రమ నిర్మాణం జరుగుతున్నా క్షేత్రస్థాయి అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదులు అందినప్పటికీ మామూళ్లు తిన్న కొందరు అధికారులు తెలిసి తెలవనట్లుగా నటిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సిఎంసి కార్యాలయంలో కమిషనర్‌కు పిర్యాదు చేసినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను సక్రమంగా కొనసాగేందుకు ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతూ అక్రమ కట్టడాలను కూల్చకుండా వారికి అండగా కొందరు అధికారులు ఉంటున్నారు. పలు ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసనుల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాల విషయంలో జోన్ కమిషనర్ దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పే అధికారులు, ఇలాంటి అక్రమ కట్టడాలను ప్రారంభ దశలోనే ఎందుకు అడ్డుకోవడం లేదు? చిత్త శుద్ధి ఉంటే తక్షణమే విచారణ జరిపి అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని స్థానికుల డిమాండ్ చేస్తున్నారు.తక్షణమే స్పందించి, అక్రమంగా నిర్మించిన సెల్లార్‌ను పూడ్చివేసి, సెట్‌బ్యాక్‌ల నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి వాసులు కోరుతున్నారు.

సందేశాత్మకం తెలంగాణ ప్రజాకళ కవి సమ్మేళనం

సత్కారగ్రహీతలైన కవులతో వాణిప్రసాద్, నరసింహారెడ్డి, విద్యానందచారి తదితర అతిథులు

రవీంద్రభారతి, మే 7 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి పర్యవేక్షణలో తెలంగాణ ప్రజాకళ శీర్షికన జరుగుతున్న 99 రోజుల ప్రతిష్టాత్మక సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనల్లో భాగంగా రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల) కళావేదికలో వివిధ తెలంగాణ కళా సాంస్కృతికోత్సవాలలో భాగంగా సాహిత్యవారం సందేశాత్మక కవిసమ్మేళనం అద్భుతంగాసాగి ఆహుతులను ఆలోచింపజేసింది. రమాదేవి కులకర్ణి నిర్వహణలో జరిగిన ఈ కవిసమ్మేళనంలో కవులు ఎం.రాజారావు, ఎన్.రవీంద్ర సూరి, బి.రాజ్‌కుమార్, బి.బాలన్న, వి.రామిరెడ్డి, గఫూర్‌శిక్షక్, టి.రాజేశం, ఎస్.లక్ష్మీనారాయణ, ఎస్.నాగేంద్ర శర్మ, జి.మల్లారెడ్డి, టి.నరసింహారావు, కె.మల్లారెడ్డి, పి.యాదగిరి, ఆర్.వనజ, శాంతారెడ్డి, మధుకర్, వెంకటసత్యమూర్తి, కె.రవీందర్, ప్రమోద్‌కుమార్, యు.పద్మ, డా. దుర్గాదేవి, సర్దార్ బహదూర్‌సింగ్, కె.రాజ్ కుమార్, ఎ.నారాయణ, యాదయ్య, డా. జె.దివాకరాచారి, కె.నిహారిణి, బి.శ్రీనివాసరావు తమ తమ కవితలో ఆకట్టుకున్నారు. వ్యాఖ్యాతగా విద్యానందచారి తనదైన శైలిలో కార్యక్రమాన్ని సమన్వయపరుస్తూ ముందుకు సాగగా ముఖ్యఅతిథిగా హాజరైన పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్, విశిష్ట అతిథిగా రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి తదితరులు పాల్గొని కవులను ఘనంగా సత్కరించారు..

మాదిగ హక్కుల సాధనకు సంఘటితంగా ఉద్యమించాలి : మోత్కుపల్లి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

కంటోన్మెంట్,మే 7 ప్రభాతవార్త: రాష్ట్రంలో 70 లక్షల జనాభా కలిగిన మాదిగలు రాజకీయ శక్తిగా ఎదిగేందుకు రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి కట్టుగా ఉద్యమించాలని మాజీ మంత్రి,మాదిగ మహ శక్తి వ్యవస్థాపకులు మోత్కుపల్లి నర్సింహులు పిలుపునిచ్చారు. గురువారం కంటోన్మెంట్ పికెట్ లక్ష్మి నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగల ఓటు మాదిగలకే అనే వేస్తాం అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. మాదిగల ఓట్లతో ఇతరులు రాజ్యా మేలుతున్నారన్నారు. మాదిగలు బానిసలుగా బతుకొద్దన్నారు. మాదిగల్లో రాజకీయ చైతన్యం రావాలన్నారు. అంబేద్కర్ ఇచ్చిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని రాజకీయ శక్తిగా ఎదగాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మాదిగ మహా శక్తి సత్తా ఏమిటో చూపాలన్నారు. అన్ని కులాలకంటే 70 లక్షలకు పై చిలుకున్న మాదిగలన్నారు. బోయిన్‌పల్లి మార్కెట్ వైస్ చైర్మన్,సీనియర్ కాంగ్రెస్ నేత డి.బి.వేందర్ అధ్యక్షతన జరిగిన బోయిన్‌పల్లి మార్కెట్ వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్ (దేవుడు) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బంధు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు పల్లెల వీరస్వామి, మాదిగ మహాశక్తి నాయకులు ముంజగల్ల విజయ్ కుమార్, అశోక్, వసపాక నర్సింహ్మ,బంగారు సదానంద్, దుడ్డు సత్య నారాయణ, వినోద్, యు.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాలపై సమీక్ష



పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ వెంకట మణి కరణ్

దుండిగల్, మే 7, ప్రభాతవార్త : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా దుండిగల్ సర్కిల్ పరిధిలో చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను గురువారం డిప్యూటీ కమిషనర్ ఎస్. వెంకట మణి కరణ్ పరిశీలించారు.ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ పరిధిలోని ట్రీ పార్క్‌ల వద్ద కంపోస్ట్ గుంతలను ఏర్పాటు చేశారు. అనంతరం దుండిగల్ తండా–2లో ఉన్న డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్, తడి చెత్తను కంపోస్టింగ్ విధానంలో నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.అదేవిధంగా వాణిజ్య దుకాణాలు, హోటళ్ల వద్ద తప్పనిసరిగా చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ నిబంధనను పాటించని వారికి చెత్త బుట్ట లేకుంటే లైసెన్స్ లేదు విధానం అమలు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్ల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని, చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అలాగే రోడ్డు పక్కన ఉన్న నిర్మాణ వ్యర్థాలను వెంటనే తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఘన వ్యర్థాల నిర్వహణ విభాగం డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, సహాయ ఇంజనీర్ అశోక్ కుమార్, పర్యావరణ ఇంజనీర్ పి. సాత్విక్, ఎస్ ఎఫ్‌ఏలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై సిఎం సలహాదారుకు వినతిపత్రం

దుండిగల్, మే 7, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న పలు ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు కోసం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేంనరేందర్ రెడ్డిని గురువారం కాంగ్రెస్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను సీఎం సలహాదారు దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కోరారు

గ్యాస్, నిత్యావసరం సరుకుల ధరలు తగ్గించాలి

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

నిజాంపేట్, మే 7, ప్రభాతవార్త

పెరిగిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని, సిపిఐ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు నిజాంపేట్ మెయిన్ రోడ్డులో సిపిఐ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేయడం జరిగింది. అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ..కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఏర్పాటు అయినా తరువాత అనేక సార్లు గ్యాస్ ధరలు పెంచడం జరిగిందని అన్నారు. అలాగే పెట్రోల్, డీజిల్ కొరత లేకపోయినా కొరత ఉన్నట్లు, దానికి అమెరికా, ఇరాన్ యుద్ధమే కారణమని చెప్పి తాత్కాలిక కొరతను సృష్టించి తద్వారా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే యోచనలో మోడీ ప్రభుత్వం వుందని వారు విమర్శించారు. దేశ వ్యాప్తంగా నిత్యావసర సరుకుల ధరలు, కూరగాయల ధరలు పెరిగిన కేంద్ర ప్రభుత్వం తగ్గించే ప్రయత్నం చేయడం లేదన్నారు. పెరిగిన ధరలు తగ్గించే వరకు పెద్ద ఎత్తున్న పోరాటాలు నిర్వహించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆశి. యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, నర్సింహ, కృష్ణ, దుర్గయ్య, మల్లేష్, శంకర్,నర్సమ్మ, భాగ్యమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

గొప్ప సంఘసంస్కర్త దామోదరం సంజీవయ్య : సూర్యారావు

సంజీవయ్యచిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న సూర్యారావు, అర్జున్, విజయరాజ్ తదితరులు

హైదరాబాద్,మే 7,ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య తన పదవికి వన్నె తెచ్చాడని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు అన్నారు.దామోదర సంజీవ య్య వర్ధంతి సందర్భంగా డౌన్ టౌన్ మాల్ మీడియా సెంటర్లో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. లా అప్రెంటిసు చేస్తున్న సమయములో వివిధ రాజకీయనాయకుల పరిచయము, సాంగత్యము వలన రాజకీయాలలో ప్రవేశించాలనే ఆసక్తి కలిగిందన్నారు. సంజీవయ్య మంచి వక్త. తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ ధారాళంగా, మనోరంజకంగా మాట్లాడేవారనీ అన్నారు. అఖిలభారత కాంగ్రెస్ పార్టీకి తొలి దళిత అధ్యక్షుడిగా సేవలు చేయడం తో పాటు కేంద్ర స్థాయిలో మంత్రి పదవులను సైతం అనుభవించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. పట్టుదల విడవకుండా దీక్షతో ముందుకు వెళ్ళి మనకందరికీ ఆదర్శంగా నిలిచిన వ్యక్తి అని సూర్యారావు అన్నారు. యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కోల్లూరి అర్జున్ మాట్లాడుతూ రాష్ట్రంలోని దామోదర సంజీవయ్య స్ఫూర్తిని తీసుకొని రాజ్యాధికారం చేపట్టాలని సూచించారు.నివాళులర్పించిన వారిలో బీసీ సమాజ్ నాయకులు బట్టు విజయరాజ్, మనేకర్ విజయ్ కుమార్ నీలి, రూపేష్ కుమ్మరి, సోను, సీనియర్ జర్నలిస్ట్ సురేష్ తదితరులు ఉన్నారు.

మహేంద్రహిల్స్‌లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,మే 7 ప్రభాతవార్త: సికింద్రాబాద్ మారేడ్‌పల్లి మండలం మహేంద్రహిల్స్‌లోని సర్వే నెం 844బై 1లో హౌజింగ్ బోర్డుకు కెటాయించిన 18 ఎకరాల స్థలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టాలని, టీపిటీ ఛార్జీల నిధులను విడుల చేయాలని,రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి భూ బదలాయింపు చేయించాలని, ఆ స్థలాల్లో స్థానికంగా నివాసం ఉంటున్న నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

ఓటరు సవరణలో తప్పిదాలు జరిగితే ఊరుకోం : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, మే 7 ప్రభావార్త: ప్రత్యేక ఓటరు సవరణలో తప్పిదాలు జరిగితే ఊరుకోబోమని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. గురువారం ఆయన పద్మారావు నగర్ లోని ఎస్ఐఆర్ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమం నిర్వహణ తీరు, సిబ్బంది విధులు, ఓటరు మ్యాపింగ్ విధానం గురించి ఏఈఆర్ఓ సుజాత, సంబంధిత అధికారులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని, ప్రజలు కూడా తప్పని సరిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, తమ ఓటును జాబితాలో ఉండేలా జాగ్రత్త పడాలని చెప్పారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో సాంకేతికత అనుభవం కలిగిన సిబ్బందిని నియమించాలని, ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. స్వీపర్లను కూడా ఎస్ఐఆర్ కార్యక్రమంలో సిబ్బందిగా నియమించినట్లు మా దృష్టికి వచ్చిందని, యాప్‌ను డౌన్ లోడ్ చేయడం, వివరాలు నమోదు చేయడం వంటి విషయాలలో ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు. ఓటు షిఫ్టింగ్‌కు సంబంధించి ఇంటి యజమాని వివరాలు ఇవ్వాలని చెప్పడం సరైనది కాదన్నారు. ప్రతిసారి ఎన్నికల సమయంలో తమ పేరు ఓటరు జాబితాలో లేదని, ఆందోళనకు గురవుతుంటారని, అలాంటి పరిస్థితులు రాకుండా నెల ఈ కార్యక్రమంలో ప్రజలు జాగ్రత్త పడాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మారావునగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, నాయకులు అంబులెన్స్ సురేష్, శ్రీకాంత్ రెడ్డి, రమణ, శైలేందర్, మిట్టపల్లి బాబూరావు, సుధాకర్ రెడ్డి, వెంకట్, నాగలక్ష్మి, అనిత పాల్గొన్నారు.

కొంపల్లి డిప్యూటీ కమిషనర్‌ను సత్కరించిన కాంగ్రెస్ నాయకులు

కొంపల్లి, మే 7, ప్రభాతవార్త : ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్యని గురువారం కొంపల్లి మాజీ సర్పంచ్, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జెమ్మి దేవేందర్ ఆధ్వర్యంలో కొంపల్లి డివిజన్, దూలపల్లి డివిజన్, సాయిబాబా నగర్ డివిజన్, సుభాష్ నగర్ డివిజన్‌లకు చెందిన కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయా డివిజన్‌లలో నెలకొన్న ప్రధాన ప్రజా సమస్యలను డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు సమర్పించారు. ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ లేబర్ సెల్ అధ్యక్షుడు కావలి గోపాల్ ముదిరాజ్, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి ఉప్పేందర్ రెడ్డి, కొంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కావలి నవీన్ ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఖదీర్ పాషా, ఎర్రోళ్ల కృష్ణ, దప్పు నరేందర్, జెమ్మి భాస్కర్, శశిధర్, యూఎంసీ కాలనీ అధ్యక్షుడు అంజనేయులు, భాస్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల అధ్యక్షులు హాజరయ్యారు.

ఓటరు జాబితా సవరణ శిబిరం పరిశీలన

సంజీవరెడ్డి నగర్, మే 7, ప్రభాతవార్త: బల్కంపేట బీజేఆర్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం నిర్వహించిన ఓటరు జాబితా సవరణ శిబిరంలో అమీర్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎం. హనుమంతరావు, కట్ట బలరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో పేర్లు, వివరాల్లో ఉన్న లోపాలను సవరించేందుకు ప్రజలకు సహకారం అందించాలని పర్యవేక్షకుడు మహేందర్‌తో పాటు బూత్ స్థాయి అధికారులు అనిల్, సుధాకర్, మధు, జ్యోతిలను కోరారు.అలాగే ప్రజలందరూ తమ ఓటు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ బూత్ స్థాయి అధ్యక్షులు గిరిబాబు, రేణుక నగర్ శ్రీనివాస్, ముత్యాల సాయినాథ్, శానం అరుణ, లలితమ్మ పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS

LOST & FOUND

★ I, ADIRAJU SWARNA KUMARI, W/O DARBHA VENKATA KRISHNA, AGED 77 YEARS, residing at FLAT NO. 73, DAFFODIL TOWER, L&T SERENE COUNTY, GACHIBOWLI, HYDERABAD-500032, have MISPLACED my PASSPORT bearing no. P-3740179, issued on 21-12-2016. I LOST IT WHILE TRAVELLING FROM SECUNDERABAD STATION TO CURRENT LOCATION If found, Please Contact -9948098787.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
గాజుల రామారం సర్కిల్-57

NIT No & Date: 02/DB/EE/గాజుల రామారం సర్కిల్-57/CMC/2026-27

పనిపేరు: నిర్వహణ పనులు (2నం.లు) అంచనా మొత్తం లక్షలలో: 17.30 లక్షలు. ప్రారంభ తేదీ, సమయం: 08.05.2026 మ.3.00గం. బిడ్ స్వీకరణకు చివరి తేదీ, సమయం: 15.05.2026 మ.3.00గం. టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మొబైల్ నం.తో: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నం. 7893066262. హెడ్ డ్రాఫ్ట్స్‌మన్: సెల్ నం: 9063836115. తదుపరి వివరాలు www.tender.telangana.gov.in ఇ-ప్రొక్యూర్‌మెంట్ వద్ద చూడవచ్చును.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజుల రామారం సర్కిల్-57, CMC.

DIPR.NO. 2077-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 07.05.2026

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE - CUM - CHIEF JUDICIAL MAGISTRATE, AT: MALKAJGIRI
O.S.No. 286 OF 2026

Between:
1. Vaddevaram Hema, W/o. Vaddevaram Purusotham, Aged 51 years, Occ: Household.
2. Vaddevaram Lakshmikanth, S/o. Vaddevaram Purusotham, Aged 28 years, Occ: Private Employee,
Both R/o. H.No. 29-1430/6, Kakatiyanagar, Near Old Current Office, Neredmet, VTC: Malkajgiri, Medchal-Malkajgiri District.
...Plaintiffs
AND
1. The Tahsildar, Malkajgiri Mandal, Medchal-Malkajgiri District.
2. All Concerned
.....Defendants

To,
All Concerned (D2)

Please take notice that the Plaintiffs herein has filed the above Suit for declaration of Plaintiffs as legal heirs of deceased Vaddevaram Purusotham, who died Intestate on 26-06-2024 in respect of Suit Schedule Property. The above said case is posted to 17.06.2026 at 10.30 am. In the above Court, If anybody is having any claim or objection may approach this Hon'ble Court with valid documents, either in person or through an Advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(By Order of the Hon'ble Court)
Sd/- C. SHAILAJA, Advocate, West Marredpally, Secunderabad.

PUBLIC NOTICE

The General Public are hereby informed that my client Sri. Mokasi Bheemashena S/o. M. Anumaiah, aged about 35 years, Occ: Business, R/o. H.No. 4-3-135/65/1, Ranganayakulagutta Colony, Hayathnagar, Hyderabad-501 505. My client is absolute owner and possessor of Plot No. 88 A (North Part) admeasuring 124 Sq. Yards or its equivalent to 103.66 Sq. Mtrs in Sy. Nos. 60/2, 60/3, 60/4, 60/5 and 60/6 in 'RTC Colony, situated at Anmagal Hayathnagar Village, Hayathnagar Revenue Mandal, Ranga Reddy district under ward No.4, Block No.3 of GHMC having purchased the same through a registered sale deed No. 3007/2017 dated 03-06-2017 from T. Omprakash Rep. by its GPA holder P. Srikanth Reddy at the time purchase my vendor handed over original link documents i.e., Sale Deed No. 6303/1983 and Sale Deed No. 1364/2009 pertaining to the said property which were lost, while he was shifting house from Ananda Nagar Colony to Ranganayakulagutta, Hayathnagar and inspite of his best efforts he could not able to trace it and it is lost beyond recovery.
If any person/s is/are got above Original Sale Deeds he/she/they may handover the same to the undersigned within seven (7) days from the date of this Publication.

Sd/- G. MAHATMA
Advocate
Hayathnagar, Ranga Reddy District. Phone No.9000139467
Counsel for the Petitioner/Plaintiff

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT: AT: HAYATHNAGAR
O.S.NO.310 OF 2026

Between;
Gunti Priyanka ...Plaintiff
AND
The Tahasildar, Hayathnagar Mandal, Hayathnagar & Others ...Defendants
To
All concerned ...Defendants

NOTICE

Please take notice that the above named plaintiff filed suit for declaration to Declare the Plaintiff herein as Legal Heir of LATE GOVINDA RAJU, S/o. Late. THIMMAPPA & Late Smt. NIRMALA W/o. LATE GOVINDA RAJU., LATE GOVINDA RAJU, S/o. Late. THIMMAPPA, he died on 10-03-2018, Late Smt. NIRMALA, W/o. LATE GOVINDA RAJU, she died on 29-10-2017. The plaintiff is a sole Legal heir and daughter of Late Govinda Raju and Late Smt.Nirmala. The above suit is posted to 08-06-2026 for appearance. Any persons intend to oppose the claim of the plaintiff are here by summoned to appear either in person or through an advocate with your defense. If any at 10:30 a.m. on the above said date before the Hon'ble court, failing which the suit will be heard & decided exparte.

(By order of the Hon'ble court)
Sd/- A. Ram Mohan, Advocate
Hayathnagar, Hyderabad -70.
Cell No. 9849853426

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, HYDERABAD (SOUTH)
ABR.CF.No: HS 280 OF 2025

BETWEEN:-
M/S MARGADARSI CHIT FUND PRIVATE LIMITED, Ameerpet BRANCH, represented by its Foreman/ Branch Manager ...DISPUTANT
and
MR. K. YADAGIRI ...OPPONENT

1. MR.KOTIGANTI YADAGIRI, S/O LATE KOTIGANTI CHANDRAIAH, DOB:14/06/1988, W/AS: RONEO OPERATOR, EMP.CODE: 2596071, 0/0 Q.Q GOVERNMENT POLYTECHNIC, OPP: ZOO PARK LANE BAHADURPURA, HYDERABAD-500064. R/O H.No. 10-5-825/13, TUKARAMGATE POLICE STATION, EAST MAREDPALLY, SECUNDERABAD-500026.
2. MR.MOHAMMED ABDUL IMTIYAZ SIDDIQUI, S/O LATE MOHAMMED ABDUL JALEEL SIDDIQUI, DOB: 24/12/1987, W/AS: JUNIOR ASSISTANT, EMP. CODE: 2587568, 0/0 Q.Q GOVERNMENT POLYTECHNIC, OPP: ZOO PARK LANE, BAHADURPURA, HYD-500064. R/O. H.No. 18-8-51/4/8/A, FATHESHA NAGAR, EDI BAZAR, MOIN BAGH, NEAR KHAN KHAN HOTEL, BANDLAGUDA, KANCHANBAGH, HYD-500058.
3. MR.JALLAPALLY KIRAN, S/O LATE JALLAPALLY SHANKER, DOB: 10/05/1981, W/AS: JUNIOR ASSISTANT, EMP.CODE: 2567521, O/O GOVERNMENT POLYTECHNIC, GIRMAPUR (V), MEDCHAL (M), MEDCHAL MALKAJGIRI DIST-501401. R/O H.No. 13-6-803/1, AMBEDKAR NAGAR, NEAR POCHAMMA TEMPLE, LANGER HOUSE, HYDERABAD-500008.
4. MRS.GOLCONDA KAVYA W/O LATE GOLCONDA SWAMY, A/A: 37 YEARS, OCC: HOUSE WIFE, R/O H.NO. 10-4-D/79, NEAR COMMUNITY HALL, NEAR MCPI STATUE, ADDAGUTTA, EAST MAREDPALLY, SECUNDERABAD-500026
5. MRS.GADDAM MANJULA W/O GADDAM SURESH, DOB: 14/05/1971, OCC. LAND LADY, R/O H.NO: 18-7-466/2/B/74, NEAR SHANTHI NIKETHAN HIGH SCHOOL, AMBICA NAGAR, UPPUGUDA, HYD-500053.
...Respondents/Opponents

Please take notice that the above dispute is filed against you for recovery of Rs.4,74,268-00 (Rupees Four Lakhs Seventy Four Thousand Two Hundred Sixty Eight Only) same posted to 29-05-2026 to your appearance before the Office of Deputy Registrar of Chits Arbitrator, HYDERABAD (SOUTH) at 3.00 p.m. If you fail to attend the Office of Deputy Registrar of Chits / Arbitrator on that day the matter will be heard and decided exparte.

// BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR //
Sd/- R.CHAKARDHAR
ADVOCATE
H.No:6-1-295/1, PADMARAO NAGAR SECUNDERABAD.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, HYDERABAD (SOUTH)
ABR.CF.No: HS 282 OF 2025

BETWEEN:-
M/S MARGADARSI CHIT FUND PRIVATE LIMITED, Ameerpet BRANCH, represented by its Foreman/Branch Manager. ...DISPUTANT
and
MR.B.MARUTHI & OTHERS ....OPPONENTS

1. MR.BALE MARUTHI, S/O LATE BALE BHOOMAIAH, DOB:10/05/1992, W/AS: SENIOR ASSISTANT, EMP.CODE: 1552553, O/O MUNICIPAL COUNCIL-JAGTIAL, NEAR OLD BUS STAND, JAGTIAL-505327. R/O H.NO:3-4-201, CHINTHAKUNTAWADA, JAGTIAL, JAGTIAL DISTRICT-505327.
2. MRS.BALE KALA, W/O LATE BALE LACHAIAH, D/O SUNKAPAKA HANUMANTHU, DOB:05/04/1975, W/AS: PUBLIC HEALTH WORKER, EMP.CODE: 1545379, O/O MUNICIPAL COUNCIL-JAGTIAL, NEAR OLD BUS STAND, JAGTIAL-505327. R/O H.NO.3-4-197, CHINTHAKUNTA WADA, JAGTIAL, JAGTIAL DISTRICT-505327.
3. MR.BALE ASHOK, S/O BALE HANMANTHU, DOB:11/03/1978, W/AS: JUNIOR ASSISTANT, EMP.CODE: 1545313, O/O MUNICIPAL COUNCIL-JAGTIAL, NEAR OLD BUS STAND, JAGTIAL-505327. R/O H.NO.3-4-211, CHINTHAKUNTA WADA, JAGTIAL, JAGTIAL DISTRICT-505327.
4. MR.BADUGU PRASAD, S/O BADUGU RAJAIAH, DOB:10/06/1980, W/AS: REVENUE OFFICER (SPL), EMP.CODE: 1549344, O/O MUNICIPAL COUNCIL-JAGTIAL, NEAR OLD BUS STAND, JAGTIAL, JAGTIAL DISTRICT-505327. R/O H.NO.3-4-113/1, CHINTHAKUNTA WADA, JAGTIAL, JAGTIAL DISTRICT-505327.
....Opponents

Please take notice that the above dispute is filed against you for recovery of Rs.4,28,303-00 (Rupees Four Lakhs twenty eight thousand three hundred and three Only) same posted to 29-05-2026 to your appearance before the Office of Deputy Registrar of Chits Arbitrator, HYDERABAD (SOUTH) at 3.00 p.m. If you fail to attend the Office of Deputy Registrar of Chits / Arbitrator on that day the matter will be heard and decided exparte.

// BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR //
Sd/- R.CHAKARDHAR
ADVOCATE
H.No:6-1-295/1, PADMARAO NAGAR SECUNDERABAD.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, HYDERABAD (SOUTH)
ABR.CF.No: HS 285 OF 2025

BETWEEN:-
M/S MARGADARSI CHIT FUND PRIVATE LIMITED, Ameerpet BRANCH, represented by its Foreman/Branch Manager. ...DISPUTANT
and
M/S. J.P.AUTOMOTIVE REP BY ITS PROP. & OTHERS MR.K.JAIPAL REDDY & OTHERS. ...OPPONENTS

1. M/S.J.P.AUTOMOTIVES REP BY ITS PROP. MR.KONDAKINDI JAIPAL REDDY, S/O KLINGA REDDY, DOB:27/06/1992, SITUATED AT H.NO:37-127/5, C/O SRI SIDDI VINAYAKA BAJAJ, B/S:SECUNDERABAD CENTRAL MALL, GANDHI NAGAR, J.K.NAGAR, NEREDMET 'X' ROADS, SECUNDERABAD-500056. R/O FLAT NO.522, GK'S PRIDE APARTMENTS, BLOCK NO.5, PHASE-II, YAPRAL, VIA ALWAL, HYDERABAD-500087.
2. MR.KONDAKINDI LINGA REDDY, S/O K.NARASIMHA REDDY, DOB:01/01/1965, OCC: PROP, M/S.SRI LAKSHMI NARASIMHA FERTILIZERS PESTICIDES & SEEDS, D.NO.7-22, LINGALA ROAD, TELKAPALLY (V & M), NAGAR KURNOOL DIST-509385. R/O FLAT NO.522, GK'S PRIDE APARTMENTS, BLOCK NO.5, PHASE-II, YAPRAL, VIA ALWAL, HYDERABAD-500087.
3. MR.ANUMULA MADHAVA REDDY, S/O LATE A.JOGA REDDY, DOB:23/04/1973, OCC:MAINTANCE INCHARGE, M/S.SRI VENKATESWARA MOTORS (BIKE SHOW ROOM), D.NO:1-12-118/3, ALWAL MAIN ROAD, GOLNAKA, SECUNDERABAD-500010. R/O H.NO:1-5-1117/347, FLAT NO.301, S.V.B.RESIDENCY, ALWAL HILLS, ROAD NO.6, OLD ALWAL, SECUNDERABAD-500010.
4. MR.PARVATHAPURAM BIKSHAPATHI, S/O P.BALRAJ, DOB:06/01/1993, OCC:PROP, M/S:G R CONSTRUCTIONS, D.NO:18-397/9/174/A/1, C.S.K ENCLAVE, SHAD NAGAR, RANGA REDDY DIST-509216.
5. MR.DESHABHAKTINI NARSING RAO, S/O D.BHOOMAIAH, DOB:06/06/1968, OCC:PROPERTY HOLDER, H.NO:3-3-66/49, GUMMADI KRISHNA REDDY ENCLAVE, TURKAPALLY, BOLLARUM, MEDCHAL-MALKAJGIRI DIST-78.
6. MR.SYED SHAROOQ, S/o SYED RAFEEQ, DOB:26/10/1995, OCC:CIVIL CONTRACTOR, H.NO:9-2-79/28, ABRAR NAGAR, HASMATHPET, NEAR HASHMI SCHOOL, OLD BOWENPALLY, SECUNDERABAD-500011.
7. MR.KONDAKINDI PADMAMMA, W/O K.LINGA REDDY, D/O NAGOLE SAI REDDY, DOB: 18/06/1970, OCC:PROPERTY HOLDER, R/O H.NO:7-22, LINGALA ROAD, TELKAPALLY (V & M), MAHABOOB NAGAR-509385.
8. MRS.ANUMULA NAGA SREE W/O A.MADHAVA REDDY D/O DAKURI RAJI REDDY, DOB:14/08/1978, OCC:PROP, M/S.SRI VENKATESWARA MOTORS (BIKE SHOW ROOM), D.NO:1-12-118/3, ALWAL MAIN ROAD, GOLNAKA, SECUNDERABAD-500010. R/O H.NO:1-5-1117/347, FLAT NO.301, S.V.B RESIDENCY, ROAD NO.6, ALWAL HILLS, OLD ALWAL, SECNDERABAD-500010.
...Opponents

Please take notice that the above dispute is filed against you for recovery of Rs.37,85,231-00 (Rupees Thirty seven lakhs eighty five thousand two hundred and thirty one Only) same posted to 29-05-2026 to your appearance before the Office of Deputy Registrar of Chits Arbitrator, HYDERABAD (SOUTH) at 3.00 p.m. If you fail to attend the Office of Deputy Registrar of Chits / Arbitrator on that day the matter will be heard and decided exparte.

// BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR //
Sd/- R.CHAKARDHAR
ADVOCATE
H.No:6-1-295/1, PADMARAO NAGAR SECUNDERABAD.

ప్రధాని మోడీ మహాసభకు తరలిరావాలి : లచ్చిరెడ్డి

ప్రధాని నరేంద్ర మోదీ సభకు రావాలని పార్కులో పాదచారులను కోరుతున్న లచ్చిరెడ్డి.

వనస్థలిపురం. మే.7.ప్రభాతవార్త.
ప్రధాని నరేంద్ర మోదీహైదరాబాద్‌కు విచ్చేయనున్న సందర్భంగా మే 10న పరేడ్ గ్రౌండ్స్, సికింద్రాబాద్‌లో నిర్వహించబడనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. గురువారం బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని స్వామి వివేకానంద పార్క్ ఎన్జీవోస్ కాలనీ ,గౌతమ్ బుద్ధ పార్క్ సచివాలయ నగర్ ,శ్రీకృష్ణదేవరాయ పార్క్ ఎస్ కే డి నగర్‌లో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డిమరియు మేడ్చల్ జిల్లా ప్రభారి ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి మరియు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ,బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు , రంగారెడ్డి అర్బన్ జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీధర్ రావు పార్కులోని వాకర్ సభ్యులకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సెల్ రాష్ట్ర కో కన్వీనర్ రఘురాం నేత, ప్రధాన కార్యదర్శి ప్రేమ్నాద్, ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి, డివిజన్ సోషల్ మీడియా కన్వీనర్ కాంతారావు, నాయకులు రవిశంకర్, శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నరసింహారెడ్డి, సుధీర్ కుమార్, ప్రభాకర్ యాదవ్, శ్రీనివాసరావు, కిషోర్, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ మరియు తదితరులు ఉన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణం వద్దు : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సైదాబాద్, మే 7 ప్రభాతవార్త: టికెఆర్ కమాన్ నుండి ఓవైసీ జంక్షన్ మధ్యలో ప్రతిపాదిత రహదారి విస్తరణను విరమించుకోవాలని కోరుతూ ఎల్బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం మల్కాజ్‌గిరి మున్సిపల్ కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపాదిత ప్రాజెక్ట్‌లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా 25 అడుగుల చొప్పున విస్తరించడం వల్ల దాదాపు 300 ఇండ్లు ప్రభావితమవుతాయని అన్నారు. గతంలో రెండు సార్లు 2004, 2007లో చేపట్టిన రహదారిగా విస్తరణ పనుల్లో అనేక మంది తమ ఇండ్లను పాక్షికంగా లేదా పూర్తిగా కోల్పోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం మరోసారి రోడ్డు విస్తరణ పేరిట స్థానికులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రతిపాదిత స్థలంలో ఫ్లై ఓవర్ అవసరం లేదన్నారు. ట్రాఫిక్ సమస్యలున్న బండ్లగూడ ఆనంద్‌నగర్ చౌరస్తా, హస్తినాపురం చౌరస్తాలలో ఫ్లై ఓవర్లు నిర్మించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రవి ముదిరాజ్, చలమల యాదిరెడ్డి, శ్రీనాథ్, కనకేష్, కాలనీవాసులు నవరత్నం, నర్సింహాచారి, జగదీష్, శ్యామ్, శ్రీనివాస్, సాగర్, సుఖ్‌జీవన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి,సమీర్,గౌస్ పాల్గొన్నారు.

కంప్యూటర్ టీచర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్‌కు వినతిపత్రంనఅందజేస్తున్న కంప్యూటర్ టీచర్లు

సైదాబాద్, మే 7 ప్రభాతవార్త: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 నుండి 2015 వరకు హై స్కూల్ కంప్యూటర్ టీచర్లుగా పనిచేసిన 13 వేల మందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కంప్యూటర్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, తెలంగాణ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ కోరారు. 2008 నుండి 2015 వరకు ప్రభుత్వ హైస్కూల్స్‌లో కంప్యూటర్ విద్యను బోధించిన అనుభవజ్ఞులైన కంప్యూటర్ టీచర్ల సేవలు అప్పట్లో విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించడంలో కీలకంగా ఉన్నాయని అన్నారు. అయితే వీరంతా అప్పటి నుండి నిరుద్యోగులుగా ఉన్నారని, ప్రస్తుతం ప్రపంచం మొత్తం డిజిటల్‌గా మారుతున్న నేపథ్యంలో, ఈ టీచర్లు అందరిని పునర్నియామకం చేయాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలను జితేందర్ కోరారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శోభ, అబ్రహం, రాంప్రసాద్, జలాన్ తదితరులు పాల్గొన్నారు.

హరిహరక్షేత్రంలో భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి ప్రత్యేక పూజలు

మలక్ పేట, మే 7, ప్రభాతవార్త: మలక్ పేట పల్టాన్ లోనీ శ్రీ హరిహర క్షేత్రంలో సంకటహర చతుర్దిని పురస్కరించుకుని దేవాలయంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారికి విశేష అభిషేకం తదితర ప్రత్యేక పూజలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ముద్దగౌని అమర్ నాథ్ గౌడ్ ఎం.మాధవిఎం.వైష్ణవిఎం.రఘు నాథ్ఎం.రాఘవ నాథ్ గౌడ్లు స్వామివారికి విశేష లడ్డును నైవేద్య ప్రసాదముగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో మార్తాండ రావు, చైర్మన్ సుగురు రమేష్, ఆలయ అర్చకులు మంగళగిరి శ్రీనివాసచార్యులు, కాసుల చంద్రశేఖర్ శర్మ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, భక్తులు ముద్దగౌని అమర్ నాథ్ గౌడ్, మాధవి తదితరులు

సభ్యుల సహకారంతోనే సొసైటీ ముందడుగు : ఎండి నరేంద్ర కుమార్

మల్కాజిగిరి మే 7 ప్రభాతవార్త:
దిసిటిజన్ కోపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశం మల్కాజిగిరి సర్కిల్ హనుమాన్ పేట కమ్యూనిటీ హాల్లో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి సొసైటీ ఎండి నరేంద్ర కుమార్ హాజరై మాట్లాడుతూ అందరూ సభ్యుల సహకారంతోనే సొసైటీ ముందడుగు వేస్తుందని తెలిపారు ఎవరికీ ఏ సమస్య వచ్చినా సొసైటీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. సమిష్టి కృషితో మరింత ముందుకు వెళ్దామని వివరించారు. ఈ ఏడాది రూ. 500 కోట్ల కార్యకలాపాలు సాగించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ రాజు డైరెక్టర్లు ఏ సోమలింగం గౌడ్, లావణ్య రేఖ, బ్రాంచ్ మేనేజర్ ఎస్ ఎం పీరాన్, ఖాతాదారులు ఏ. వీ స్వామి, నూర్,శంకర్ రావు, హను మాన్ పేట కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు నేషనల్ సైన్స్ సెంటర్.. నిర్మాణ పనులు పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

తార్నాక, మే 7 ప్రభాతవార్త : తార్నాకలో నిర్మాణంలో ఉన్న హైదరాబాద్ నేషనల్ సైన్స్ సెంటర్ పనులను గురువారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి, వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరానికి ఈ సైన్స్ సెంటర్ మరో ప్రతిష్ఠాత్మక కేంద్ర ప్రభుత్వ సంస్థగా నిలుస్తుందని తెలిపారు. రక్షణ, సైన్స్, ఐటీ, విద్యా రంగాల్లో ఇప్పటికే ప్రముఖ పరిశోధనా సంస్థలు ఉన్న హై దరాబాద్‌లో ఇప్పుడు నేషనల్ సైన్స్ సెంటర్ ఏర్పాటు కావడం గర్వకారణమన్నారు. యువత, విద్యార్థులు, పరిశోధకులకు సైన్స్, టెక్నాలజీ రంగాల్లో ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవతో ఈ సైన్స్ సెంటర్ హైదరాబాద్‌కు మంజూరైందని, వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలనే లక్ష్యంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అధికారుల సమాచారం ప్రకారం వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఈ నెల 10న హైదరాబాద్ పర్యటనకు రానున్నట్లు వెల్లడించిన కిషన్ రెడ్డి సందర్భంగా రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ పార్క్, వరంగల్‌లో ప్రధాన మంత్రి మెగా టెక్స్‌టైల్ కాకతీయ పార్క్ పనులకు భూమి పూజలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే జాతీయ రహదారులు, రైల్వే నెట్‌వర్క్ అభివృద్ధి పనులను జాతికి అంకితం చేయనున్నారని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్, వరంగల్ రైల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. ములుగులో ఏర్పాటు కానున్న ట్రైబల్ యూనివర్సిటీ, ఎయిమ్స్ తరహా ఆసుపత్రుల భూమిపూజలు లేదా ప్రారంభోత్సవాలను కూడా రాబోయే మూడు నుంచి నాలుగు నెలల్లో ప్రధానమంత్రి చేతుల మీదుగా నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బిజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగ్ రావు పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్సతో యువతిని కాపాడిన మలక్‌పేట కేర్ ఆసుపత్రి వైద్యులు

రోగికి శాస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్న కేర్ ఆస్పత్రి వైద్యులు

మలక్ పేట, మే 7, ప్రభాతవార్త:
సాధారణ కడుపు అసౌకర్యంగా ప్రారంభమైన సమస్య, జీవితాంతం మధుమేహం, జీర్ణ సమస్యలతో బాధపడే పరిస్థితిగా మారే అవకాశం ఉన్నప్పటికీ సమయానికి సరైన నిర్ధారణ, నిపుణుల వైద్యం వల్ల ఇబ్రహీంపట్నం చెందిన 33 ఏళ్ల సుష్మితకు ఆ ప్రమాదం తప్పింది. మలక్ పేట కేర్ హాస్పిటల్స్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్యాంక్రియాస్‌ను కాపాడుతూ ట్యూమర్‌ను విజయవంతంగా తొలగించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్, సర్జికల్ గాస్ట్రోఎంటెరోలోజీ, రోబోటిక్ శస్త్రచికిత్స విభాగాధిపతి డాక్టర్ భూపతి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ..ప్యాంక్రియాస్‌కు సంబంధించిన ట్యూమర్లు సాధారణంగా ప్రారంభ దశలో స్పష్టమైన లక్షణాలు చూపవని, అందుకే చాలా మంది ఆలస్యంగా గుర్తిస్తారని తెలిపారు. ఎక్కువగా శస్త్రచికిత్సలో భాగంగా ప్యాంక్రియాస్‌లో పెద్ద భాగాన్ని తొలగించాల్సి వస్తుందని, దీనివల్ల జీవితాంతం మధుమేహం, జీర్ణ సమస్యలు వంటి ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. ప్యాంక్రియాస్ శరీరంలో చాలా ముఖ్యమైన అవయవమని, ఇది ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసి రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుందని, అలాగే జీర్ణక్రియకు అవసరమైన ఎంజైమ్స్‌ను కూడా ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. ఈ అవయవం పెద్ద భాగం తొలగితే రోగులు జీవితాంతం ఇన్సులిన్‌పై ఆధారపడాల్సి వస్తుందని, ముఖ్యంగా యువ రోగుల్లో ఇది జీవన నాణ్యతపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అయితే ఈ కేసులో కేర్ వైద్యులు విభిన్నంగా ఆలోచించి ట్యూమర్‌ను తొలగించడమే కాకుండా, ప్యాంక్రియాస్‌ను ఎంతవరకు కాపాడగలమన్న దానిపై దృష్టి పెట్టామని తెలిపారు. తమ నేతృత్వంలో ఆసుపత్రి వైద్య బృందం ల్యాపరోస్కోపిక్ సెంట్రల్ ప్యాంక్రియాటెక్టమీ అనే క్లిష్ట శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని, తర్వాత రూక్స్ఎన్‌వై ప్యాంక్రియాటికోజెజునోస్టమీ ద్వారా అవయవాన్ని పునర్నిర్మించామని వివరించారు. ఈ శస్త్రచికిత్స అంత సులభం కాదని ,రోగికి ప్యాంక్రియాస్ చాలా మృదువుగా ఉండటం, ప్యాంక్రియాటిక్ డక్ట్ పరిమాణం కేవలం 2 మిల్లీమీటర్లు మాత్రమే ఉండటం వల్ల శస్త్రచికిత్స మరింత సవాలుగా మారిందని, ఇలాంటి పరిస్థితుల్లో శస్త్రచికిత్స చేయడం చాలా అరుదనీ,అన్ని సవాళ్ల మధ్య శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. ఇలాంటి శస్త్రచికిత్సలు యువతకు ఎంతో మేలు చేస్తాయని, మా ఆసుపత్రిలో రోగికేంద్రిత సేవలను అందించడం మా ప్రధాన లక్ష్యమని" అన్నారు.కడుపులో స్వల్ప అసౌకర్యం ఉన్నా, అది ఎక్కువ రోజులు కొనసాగితే నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారనీ, తొందరగా పరీక్షలు చేయించుకుంటే అవయవాన్ని కాపాడే చికిత్సలు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రధాన నాలాలలో పూడికతీత పనులు : పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్‌లో పూడికతీత పనులు ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, మే 7 ప్రభాతవార్త : వర్షాకాలంలో ముంపు సమస్యలు రాకుండా అన్ని ప్రధాన నాలాలలో పూడికతీత పనులు చేపట్టినట్లు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ డివిజన్ పరిధిలో రూ.40 లక్షలతో నాలాల పూడికతీత పనులను మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని నాలాలలో పూడికతీత పనులను చేపడుతున్నామని తెలిపారు. ఉప్పల్ శేషసాయినగర్ నుండి నల్లచెరువు వరకు, కావేరి నగర్ కాలనీ నుండి నల్లచెరువు వరకు, రామంతాపూర్ టివి కాలనీ నుండి సత్యనగర్ కల్వర్ట్ వరకు నాలాల పూడికతీత పనులను చేపడుతున్నామన్నారు. పనులు వేగంగా పూర్తి చేయాలని, నాలాలలో పేరుకుపోయిన ముురుగు, చెత్తను పూర్తిగా తొలగించి నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మౌళిక వసతులు మెరుగుపరచడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ వెన్నెల గౌడ్, ఎఇ రాజ్ కుమార్, కాలనీ నేతలు నరసయ్య, ప్రభాకర్, రాకేష్ నాయక్, సల్ల ప్రభాకర్ రెడ్డి, పవన్, శ్రీనివాస్, వేణు, మహేశ్, సత్తిరెడ్డి, సోమిరెడ్డి, జగన్ రెడ్డి, నాగేష్, రంగారెడ్డి, గల్లయ్య, ఓబుల్ రెడ్డి, సంతోష్, సమ్మయ్య, శ్రీనివాస్, గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ సభను విజయవంతం చేయాలి : కోల శ్రీనివాస్

తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కవితతో కోల శ్రీనివాస్

సరూర్‌నగర్, మే 7 ప్రభాతవార్త: తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) వ్యవస్థాపకురాలు కవిత ఆధ్వర్యంలో నేడు శుక్రవారం రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెం (లక్ష్మీదేవి పల్లి) రైతు వేదిక వద్ద జరిగే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ సభను విజయవంతం చేయాలని టిఆర్ఎస్ నాయకుడు, తెలంగాణ జాగృతి ఉపాధ్యక్షుడు కోల శ్రీనివాస్ కోరారు. పార్టీ ఏర్పాటైన తర్వాత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభకు రైతులు, ప్రజలు, తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న యోధురాలు కవిత తలపెట్టిన ఈ సభ విజయవంతానికి కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు.

డాక్టర్ చిలుకు స్వామికి ఘన సత్కారం

మల్కాజిగిరి మే 7 ప్రభాతవార్త: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కాలేజీ ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ కు తెలంగాణా ప్రభుత్వ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శ్రమ శక్తి అందుకొన్న సందర్బంగా డాక్టర్ చిలుకు స్వామి ని సౌత్ సెంట్రల్ రైల్వేఅజ్దూర్ యూనియన్ , ఆల్ ఇండియా పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. జనరల్ సెక్రటరి యుగంధర్, స్వామి సేవలను కొని యాడారు. ఎలక్ట్రికల్ బ్రాంచ్ సభ్యులు పి బి ఎన్ ప్రసా ద్, జెడ్ ఆర్ యూ సీ సీ మెంబెర్ నూర్ డాక్టర్ స్వామి కి అభినందనలు తెలిపారు. అరుణ్ కుమార్, బాబు రావు ఉదయ్ రాయ్ పాల్గొన్నారు.

మోడీ సభ విజయవంతం చేయాలని కరపత్రాలు పంపిణీ చేస్తున్న బిజెపి నేతలు గడ్డం సాయికిరణ్, ఎల్లాచారి తదితరులు

ప్రధాని సభ నేపధ్యంలో బిజెపి సన్నాహక సమావేశం

సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సైదాబాద్, మే 7 ప్రభాతవార్త: ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే భారీ బహిరంగ సభకు ప్రజలంతా స్వచ్ఛందంగా తరలిరావాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. ప్రధాని సభను విజయవంతం చేయడం లక్ష్యంగా ఐఎస్ సదన్ డివిజన్ వినయ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో భాగ్యనగర్ జిల్లా బిజెపి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని సభను విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి దిశా నిర్దేశం చేశారు. ప్రధాని తెలంగాణా పర్యటనలో దాదాపు రూ.8 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం జరుగుతుందన్నారు. రూ.1,695 కోట్లతో నిర్మించిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును జాతికి అంకితం చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్, బిజెపి సీనియర్ సిటిజన్స్ సెల్ కన్వీనర్ సుభాష్ చందర్జీ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, జంగం మధుకర్‌రెడ్డి, వీరేందర్‌బాబు, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, జిల్లా బిజెపి అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు జంగం శ్వేత, కొత్తకాపు అరుణ, కూసూరు సహదేవ్ యాదవ్, బిజెపి రాష్ట్ర, జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇంఛార్జిలు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యాని అక్రమంగా తరలిస్తున్న నిందితుల అరెస్టు

హయత్ నగర్, మే 7 ప్రభాతవార్త :
అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న హయత్ నగర్ పోలీసులు 19 టన్నుల బియ్యాన్ని, రెండు లారీలు, రెండు మినీ వాహనాలు, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.... పెద్ద అంబర్పేట లోని పిస్తా హౌస్ వెనుక అశోక్ లేయలాండ్ మినీ వాహనాలలో నుండి లారీల లోకి రేషన్ బియ్యాని మార్చు తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి దాడి చేశారు. నగరం లోని వేరు వేరు ప్రాంతాల నుండి రేషన్ బియ్యాన్ని సేకరించిన వ్యాపారులు వాటిని లారీలలో నింపి మహారాష్ట్ర కు తరలిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్కేపురం అభివృద్ధి కాంగ్రెస్ లక్ష్యం : పున్న

కాలనీలో పర్యటిస్తున్న పున్న గణేష్‌నేత

ఎల్.బి.నగర్, మే 7 ప్రభాతవార్త: సమస్యలు లేని డివిజన్‌గా ఆర్కేపురాన్ని తీర్చిదిద్ది అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని ఆర్కేపురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత పేర్కొన్నారు. శ్రీరామకృష్ణపురం డివిజన్ లక్ష్మినగర్‌కాలనీ రోడ్‌నెంబర్ 1, ఎస్బిఐ కాలనీ రోడ్‌నెంబర్ 4లో గుంతల మయంగా తయారైన రోడ్లను గురువారం కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, సరూర్‌నగర్ సర్కిల్ ఏఈ ప్రశాంతితో కలిసి క్షేత్రస్థాయిలో పున్న గణేష్‌నేత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్లను బాగు చేయించడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీరామకృష్ణాపురం డివిజన్లో ఉన్న అన్ని కాలనీల సమస్యలను మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి సహకారంతో సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి మందుల శ్రీధర్‌రాజ్(బాపూ), లక్ష్మీ నారాయణ,నరేందర్‌రెడ్డి,తడక మురళి, శ్రీనివాస్, హరీష్ ఎస్బిఐకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కణతల బిక్షంరెడ్డి,కార్యదర్శి ఆనంద్‌రావు, రమేష్‌రెడ్డి లక్ష్మారెడ్డి, ఉదయ్‌శంకర్,ప్రతాపరెడ్డి,గంగయ్య,అనంతరెడ్డి, జయభారత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ : బత్తుల

మజ్జిగ అందజేస్తున్న బత్తుల సుమన్‌గౌడ్

ఎల్.బి.నగర్, మే 7 ప్రభాతవార్త: మండుతున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని బాటసారుల దాహార్తించేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు రంగారెడ్డి జిల్లా బిజెపి అధికార ప్రతినిధి బత్తుల సుమన్‌గౌడ్ పేర్కొన్నారు. సుమన్ గౌడ్ ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్ వికాస్‌నగర్ కాలనీలోని తన కార్యాలయం వద్ద గురువారం నూతన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి బాటసారులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మండుటెండలో ప్రయాణిస్తున్న వారికి చలివేంద్రం ద్వారా కాస్త ఉపశమనం లభిస్తుందనే ఉద్దేశంతో చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు పలు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి దళిత మోర్చా నాయకుడు కృష్ణప్రకాష్, నాయకులు పర్ల శివ,సాయి తరుణ్, సత్యం, భార్గవ్, ధనుష్, సందీప్, సూరజ్, చింటు, గని తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ రోడ్డు తాత్కాలికంగా మూసివేత : జోనల్ కమిషనర్

ఉప్పల్ జంక్షన్ వద్ద కారిడార్ పనులు పరిశీలిస్తున్న జెడ్‌సి రాధిక గుప్తా, వికాస్ మహాతో తదితరులు

ఉప్పల్, మే 7 ప్రభాతవార్త : ఉప్పల్ జంక్షన్ వద్ద జరుగుతున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను గురువారం ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, ఎల్బినగర్ జోన్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో పలువురు అధికారులతో కలిసి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప్పల్ జంక్షన్ వద్ద జరుగుతున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ రాధిక గుప్తా మాట్లాడుతూ కారిడార్ పనుల దృష్ట్యా ఉప్పల్ జంక్షన్ నుండి వరంగల్ రోడ్ వైపు వెళ్లే మార్గాన్ని తాత్కాలికంగా మూసివేయనున్నట్లు ఆమె తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాల రాకపోకలు సజావుగా కొనసాగేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించినట్లు తెలిపారు. అదే విధంగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశమున్నందున నాగోల్ ఫ్లైఓవర్ పరిసర ప్రాంతాలను అధికారులు పరిశీలించి చోక్ పాయింట్లపై సమీక్ష నిర్వహించారు. అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు వారు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ జోన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ హరికిషోర్, డిఇ వెన్నెల్ గౌడ్, పలువురు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో గుంతల రోడ్లకు మరమ్మతులు

దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ తదితరులు

రామంతాపూర్, మే 7 ప్రభాతవార్త : రామంతాపూర్ గాంధీ నగర్‌లో గుంతల రోడ్లకు మరమ్మతులు చేయిస్తున్నట్లు రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ రఫీక్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం గాంధీనగర్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. గుంతల రోడ్ల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, స్థానికులు తన దృష్టికి తీసుకుని రావడంతో వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని పనులు పరిశీలించినట్లు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు మొగలి లింగం, లఘు స్వామి, శ్రీనివాస్ గౌడ్, నరసింహా, నరేష్, ఎండి షకీల్, సూరి ఐకాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

-భాగ్యనగర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాడిగల లక్ష్మారెడ్డి

ఆస్మాన్ ఘడ్ డివిజన్ లో ప్రజలకు కరపత్రాలను అందజేస్తున్న బిజెపి భాగ్యనగర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మడిగల లక్ష్మారెడ్డి, నాయకులు తదితరులు

మలక్ పేట, మే 7, ప్రభాతవార్త:
ఈ నెల 10వ తేదీన నగరంలోని పేరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి భాగ్యనగర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాడిగల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ మాడిగల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఆస్మాన్ ఘాడ్ డివిజన్ పరిధిలోని ఏపీఎయు కాలనీ, గడ్డి అన్నారం, రెవెన్యూ బోర్డు కాలనీ, కళ్యాణ్ నగర్ తదితర ప్రాంతాలలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడో సారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి నగరానికి విచ్చేస్తున్న సందర్భంగా ఈనెల 10వ తేదీన నగరంలోని పేరేడ్ గ్రౌండ్ లో పెద్ద ఎత్తున బహిరంగ సభ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రధాని మోడీ రాష్ట్రంలో పర్యటిస్తున్న సందర్భంగా రూ. 7823 కోట్ల విలువగల పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి, మరికొన్నింటిని జాతికి అంకితం చేయనున్నారని వివరించారు. అదే విధంగా రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో మేయర్ స్థానాలను బిజెపి కైవసం చేసుకుంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.దేశ ప్రధాని మోడీ రాక కోసం నాయకులు, కార్యకర్తలు ఎదురుచూస్తున్నారని, ప్రధాని మోడీకి ఘనంగా స్వాగతం పలుకుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ. గజానంద్, ఆర్. బి. చారి, రవి, శ్రీను, సురేష్, రిషిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోమటికుంట చెరువు, బిఆర్ఆర్ కాలనీ పార్కు వద్ద సిమెంట్ బెంచీల ఏర్పాటు

కాలనీవాసులతో బెంచీలను ఏర్పాటు చేసిన బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

సరూర్‌నగర్, మే 7 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని నాదర్‌గుల్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు, ఏఐసిసి విచార్ విభాగ్ కో–ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి డివిజన్‌లోని అల్మాస్‌గూడ కోమటికుంట చెరువు వద్ద ప్రజల సౌకర్యార్థం సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. తన స్వంత డబ్బులు రూ.1.20 లక్షల ఖర్చుతో బోయపల్లి సత్తిరెడ్డి, సత్యమ్మ, జగదీశ్వరి, రామిడిరెడ్డిల జ్ఞాపకార్థం స్థానిక కోమటికుంట చెరువు వద్ద అదే విధంగా బిఆర్ఆర్ కాలనీ పార్కులో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకింగ్, వ్యాయామం చేసే వారికి విశ్రాంతి కోసం అదే విధంగా ఆహ్లాదం కోసం వచ్చే వారి సౌకర్యార్థం బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం ఆయన కోమటికుంట, బిఆర్ఆర్ పార్కు వద్ద ఏర్పాటైన బెంచీలను స్థానిక కాలనీలవాసులతో కలిసి పరిశీలించారు. బెంచీలను ఏర్పాటు చేసినందుకు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు.

కనుల పండువగా గౌరీ నీలకంఠేశ్వర స్వామి కళ్యాణం

బ్రహోత్సవాల్లో ఆలయ ఛైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి తదితరులు

సరూర్‌నగర్, మే 7 ప్రభాతవార్త: బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ సర్కిల్‌లోని మీర్‌పేట్ శివసాయినగర్‌లో శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి కళ్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ ఛైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కాలనీలోని శ్రీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం 13వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్వామి వారి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఘనాపాఠి వారణాసి సుందర రామశర్మ ఆధ్వర్యంలో వేద పండితుల బృందం కళ్యాణాన్ని నిర్వహించింది. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆ తర్వాత పండిత సత్కారంతో బ్రహ్మోత్సవాలను సాంప్రదాయబద్ధంగా ముగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు లక్ష్మీ గణపతిరావు పర్యవేక్షణలో జరిగిన ఈ బ్రహ్మోత్సవాల్లో కమిటీ ఛైర్మన్ సుభాష్‌రెడ్డి, సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, వెంకట రమణ, అన్నాజీరావు, రామమోహన్‌రావు, రామచంద్రారెడ్డి, పలు కాలనీల ప్రజలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లకు సన్మానం

బసవరాజు శ్రీనివాస్, పొన్నాడ సుబ్రమణ్యంలను సన్మానించిన బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక నాయకులు

సరూర్‌నగర్, మే 7 ప్రభాతవార్త: తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఛైర్మన్‌గా రాష్ట్రప్రభుత్వం నియమించిన బసవరాజు శ్రీనివాస్ ను అదే విధంగా వైస్ ఛైర్మన్ పొన్నాడ సుబ్రమణ్యంను మహేశ్వరం నియోజకవర్గ బ్రాహ్మణ సంఘాల ఐక్య వేదిక నాయకులు సన్మానించారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా నియమితులైన వారిని మర్యాదపూర్వకంగా కలిసిన ఐక్య వేదిక అధ్యక్షుడు మంగు రాఘవరావు, ప్రధాన కార్యదర్శి ప్రమోద్, పలువురు సభ్యులు కలిసి పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంక్షేమం, నిరుపేద బ్రాహ్మణుల అభ్యున్నతి జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

11న సరూర్ నగర్ స్టేడియంలో మెగాజాబ్ మేళా

ఎల్.బి.నగర్, మే 7 ప్రభాతవార్త:
యువజన సేవలు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మెగాజా బ్ మేళా నిర్వహించనున్నట్లు సరూర్నగర్ మండల తహసీల్దార్ పి.వేణుగోపాల్, సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ గురువారం సం యుక్త ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో సుమారు 162 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఐటీ హెల్త్, ఇండస్ట్రియల్, ఫార్మా, రిటైల్, బ్యాంకింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్, సేవారంగం తదితర అనేక విభాగాలకు చెందిన సంస్థలు పాల్గొంటాయన్నారు.వెబ్ లింక్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఇరువురు అధికారులు నిరుద్యోగులకు సూచించారు.